ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
శుక్రవారం 29, మార్చి 2024

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే వైసీపీ ప్రలోభాల జాతర ప్రారంభించింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తోంది. ఒంగోలులో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. షెడ్యూల్ ప్రకటనకు ముందే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై నజరానాల వల విసిరిన అధికార పార్టీ నేతలు ఇప్పుడు ఓటర్లకు గాలం వేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా చీరలు, ఇతరత్రా తాయిలాల పంపిణీ ప్రారంభించారు. అయితే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు సీ విజిల్‌ను అస్త్రంగా చేసుకున్నారు. గుత్తికొండవారిపాలెం వద్ద ఓ గోదాములో భారీగా చీరలు నిల్వ ఉన్న విషయమై బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆగమేఘాలపై స్పందించి రూ. 20లక్షల విలువైన తాయిలాలను అధికారులు సీజ్ చేశారు. అయితే కేసు నమోదు విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేరోజు అర్ధరాత్రి నగరంలో వైసీపీ రంగులతో ఉన్న తోపుడు బండ్లను ఆ పార్టీ నేతలు పంపిణీ చేస్తుండగా సీవిజిల్‌కు సమాచారం అందడంతో 14 బండ్లను స్వాధీనం చేసుకున్నా వారిపై చర్యలు కరువయ్యాయి.

ఒంగోలులో వైసీపీ నేతల బరితెగింపు

విచ్చలవిడిగా ఎన్నికల తాయిలాలు

షెడ్యూల్‌కు ముందే ప్రారంభం.. అనంతరం జోరందుకున్న పంపిణీ

పట్టించుకోని అధికారులు

సీ విజిల్‌కు ఫిర్యాదుతో కదలిక

గుత్తికొండవారిపాలెం వద్ద భారీగా చీరలు స్వాధీనం

కేసు నమోదుకు మీనమేషాలు


బాలినేని బొమ్మతో ఉన్న చీరలు

అలా వదిలేస్తున్నారు!

ఒంగోలు (క్రైం), మార్చి 28 : వైసీపీ ప్రభుత్వం సాగించిన ఐదేళ్ల ప్రజాకంటక పాలనతో సీఎం జగన్‌రెడ్డి, ఆపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్రప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు. అందినకాడికి దోచుకుంటూ పాలనలో మాత్రం ఉత్సవ విగ్రహాలుగా ఉంటూ కాలం వెళ్లదీశారు. ప్రజాప్రతినిధులుగా ఉండి జనానికి చేసిన మేలును వివరించి ఓట్లు అభ్యర్థించలేని పరిస్థితి వారికి దాపురించింది. దీంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. సాము,దాన,భేద దండోపాయలను ప్రయోగిస్తున్నారు. షెడ్యూల్‌కు ముందే ప్రలోభాల పర్వానికి తెరతీసిన వారు ఇప్పుడు దాన్ని ముమ్మరం చేశారు. ఒంగోలు నగరంలో ఈ వ్యవహారం మరింత జోరుగా సాగుతోంది.


ఒంగోలులోని రాంనగర్‌లో పోలీసులు సీజ్ చేసిన తోపుడుబండ్లు

కోడ్ వచ్చిన రోజే సచివాలయ సెక్రటరీలకు తాయిలాలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ఈనెల 16న విడుదల చేసింది. ఆరోజు నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే అదే రోజు నగర మేయర్ గంగాడ సుజాత నగరంలోని సచివాలయ కార్యదర్శులను ఇంటికి పిలిపించుకొని చీరలు, ప్యాంటు, షర్ట్‌ను పంపిణీ చేశారు. ఇది వివాదాస్పదమైంది. అలాగే దానికి కొద్దిరోజుల ముందు వైసీపీకి చెందిన ముఖ్య నేత నివాసంలో ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బందికి తాయిలాలు ఇచ్చారు. వలంటీర్లకు సైతం ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. ఎక్కడికక్కడ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదును అందజేశారు. ఇలాగే ఇళ్ల పట్టణాల పంపిణీ పేరుతో డివిజన్‌లలో కార్యక్రమాలు ఏర్పాటు చేసి భరోసా పత్రంతోపాటు చీర, ప్యాంటు, షర్టు అందజేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారాన్ని మరింత ముమ్మరం చేశారు.

పొగాకు గోదాంలో భారీగా చీరల నిల్వ

ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఒంగోలు మండలం గుత్తికొండవారిపాలెంలో అనాథరైజ్డ్ పొగాకు గోదాంలో వైసీపీ నేతలు భారీగా చీరలను నిల్వ చేశారు. ఈ విషయమై సీ విజిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో బుధవారం అధికారులు దాడి చేశారు. అక్కడ 18 పెట్టెలలో 2,268 చీరలు, 500 సంచులు కనిపించాయి. చీరలు ఉన్న బాక్స్ మీద ధర ప్రకారం ఒక్కో చీర రూ.2,268 కాగా మొత్తం 864 చీరలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ 19,59,552, ఐదు వందల సంచులతో కలిపి సుమారుగా రూ.20లక్షలు విలువ ఉంటుందని వారు అంచనా వేశారు. ఈ చీరలు గుజరాత్‌లోని సూరత్ నుంచి తెప్పించినట్లు తేల్చారు. ఒంగోలు నగరపరిధిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సమయంలోనే కంటైనర్లలో భారీ ఎత్తున చీరలు తెప్పించి భారీగా నిల్వ ఉంచారని తెలుస్తోంది. మొత్తం లబ్ధిదారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలకు పంపిణీ చేయగా మిగిలిపోయినవి అక్కడ ఉంచినట్లు గోదాం యజమాని చెప్పారు.

అర్ధరాత్రి తోపుడు బండ్ల పంపిణీ

వైసీపీ నేతలు చిరువ్యాపారులను ఆకర్షించేందుకు తోపుడు బండ్ల పంపిణీని కూడా ప్రారంభించారు. నగరంలో బుధవారం రాత్రి ఈప్రక్రియను చేపట్టారు. రాంనగర్‌లో వీటిని పంపిణీ చేస్తుండగా సీ విజిల్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఆగమేఘాలపై అధికారులు అక్కడికి చేరుకున్నారు. 14 తోపుడు బండ్లను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ వైసీపీ రంగుతో ఉండటం గమనార్హం. కోడ్ అమల్లోకి వచ్చినా ఇలా వైసీపీ నేతలు విచ్చలవిడిగా ప్రలోభాలు కొనసాగించడం వారి బరితెగింపును తెలియజేస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వెనకడుగు వేయడం విమర్శలకు తావిస్తోంది.

చర్యలకు అధికారుల వెనకడుగు

పెద్ద ఎత్తున చీరలు సీజ్ చేసిన అధికారులు తదుపరి చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. దీనిపై గురువారం సాయంత్రం వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. అదేసమయంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం అది పూర్తిగా ఎన్నికలకు సంబంధించిన సామగ్రిగా గుర్తించామని చెబుతున్నారు. అసలు బిల్లులు లేని సరుకు అక్కడ ఎందుకు నిల్వ ఉంచారు అనే అంశం జోలికి వెళ్లలేదు. చీరలు ఉన్న బేళ్ల మీద మంజునాథ గ్రానైట్ మినరల్స్, శంఖవరం అనే చిరునామా ఉంది. గ్రానైట్ కంపెనీకి అంత పెద్దమొత్తంలో చీరల అవసరం ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అంశం. ఎన్నికలకు సంబంధించిందని ముడిపెట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా చీరలు పట్టుబడిన గోదాము వద్దకు ఒంగోలు ఆర్డీవో, తహసీల్దార్ వెళ్లి పరిశీలించారు. కానీ అక్కడ నిల్వ ఉంచి చీరలు ఎవరికి సంబంధించినవి అన్నది మాత్రం తేల్చలేదు. గోదాం యజమాని పమ్మి జయరామిరెడ్డి కుమారుడు వినయ్‌కుమార్‌రెడ్డి మాత్రం కొత్తపట్నం మండల వైసీపీ నేత అంజిరెడ్డి చీరలు తెప్పించి నిల్వ ఉంచారని, వాటిని తీసుకెళ్లాలని ఎన్నిమార్లు ఫోన్‌చేసినా స్పందించలేదని విలేకరులకు చెప్పారు. అధికారులు గోదాం యజమానిని విచారిస్తే అక్కడ చీరలు ఎవరు నిల్వ ఉంచారన్నది తెలుస్తుంది. కానీ ఆవైపు దృష్టి సారించలేదు. అయితే చీరలు తమవి అని ఎవరూ ముందుకు రాకపోవడంతో పౌరసరఫరాల గోదాంకు తరలించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్కడ నిల్వ ఉంచిన చీరల పెట్టెలు, సంచులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలు ఉండటమే అధికారుల తర్జనభర్జనకు కారణం అని ప్రచారం జరుగుతోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

క్షేత్రస్థాయిలో సమన్వయానికి కమిటీలు

వచ్చే నెలలో పార్లమెంట్, అసెంబ్లీ స్థాయి సమావేశాలు

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల భేటీలో నిర్ణయం

నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం


సమావేశమైన మూడుపార్టీల నేతలు జనార్దన్, రియాజ్, శివారెడ్డి

ఒంగోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో జిల్లాలోని పార్లమెంట్, అన్ని అసెంబ్లీ స్థానాల్లో కూటమి తరపున పోటీచేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంతో పనిచేయాలని ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలు తీర్మానించాయి. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా బరిలోకి దిగుతున్న విషయం విదితమే. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ప్రకటన కొలిక్కివచ్చిన నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మూడు పార్టీలు మరింత సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఇందుకోసం వచ్చేనెల 4న పార్లమెంట్, 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఐక్య సమావేశాలు నిర్వహించాలని తీర్మానించుకున్నాయి. ప్రధానంగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ అరాచక, అవినీతి పాలనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలు నిర్ణయించారు. మూడు పార్టీల తరపున ఉమ్మడి కమిటీలు వేసి కార్యాచరణ అమలుకు జిల్లా కమిటీలను ఆదేశించారు.ఈనేపథ్యంలో గురువారం ఒంగోలులో మూడు పార్టీల నేతలు తొలివిడత భేటీ అయ్యారు. స్థానిక బీజేపీ ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన ఆ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.వి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీల సంయుక్త కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రాథమికంగా చర్చించారు. నియోజకవర్గస్థాయిలో మరింత సమన్వయంతో సాగడం అవసరమని గుర్తించారు. అందుకోసం కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరోసారి మూడు పార్టీల ముఖ్యనేతలు జిల్లా స్థాయిలో సమావేశమై పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించాలని తీర్మానించుకున్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఏటా ఈ వేడుకలను సాధారణంగా నిర్వహించి జనవరిలో ఎన్‌టీఆర్ వర్థంతి, మేలో మహానాడు కార్యక్రమాలను భారీగా చేస్తారు. ఈసారి ఎన్నికల ప్రక్రియలో భాగంగా పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం రావడంతో పెద్ద ఎత్తున నిర్వహించాలని అధిష్ఠానం సూచించింది. తదనుగుణంగా జిల్లాలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు ఇతర రూపాలలో కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.


బోసిపోతున్న ఒంగోలు నగర వీధులు

మార్చిలోనే మంటలు

పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

పీసీపల్లిలో గరిష్ఠంగా 41.62 నమోదు



ఒంగోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. మార్చి ముగియకముందే మంటలు మొదలయ్యాయి. ఉదయం 10 గంటలకే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో తొలిసారి గురువారం పలు చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40నుంచి 41 డిగ్రీలపైన నమోదయ్యాయి. అత్యధికంగా పీసీపల్లిలో 41.62 డిగ్రీల ఎండ కాచింది. జిల్లాలో వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. ఏప్రిల్ ఆఖరు నుంచి ఆప్రభావం కనిపిస్తుంది, మేలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అలాంటిది ఈ ఏడాది దాదాపు నెల ముందుగానే ఎండలు మండిపోతున్నాయి. పక్షం రోజుల క్రితం వరకు జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యధిక ప్రాంతాల్లో 35నుంచి 38 డిగ్రీల వరకు ఉండగా గురువారం ఒక్కసారిగా పెరిగాయి. ఉదయం 10 గంటల నుంచే చాలా చోట్ల ఎండల తీవ్రత కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అధికంగా ఉంది. ఈ సమయంలో గరిష్ఠంగా పీసీపల్లిలో 41.62 డిగ్రీలు నమోదు కాగా బేస్తవారపేట, తర్లుపాడు, రాచర్ల, మార్కాపురం, దొనకొండ, సీఎస్‌పురం, కనిగిరి, గిద్దలూరు, కురిచేడు, అర్ధవీడు, మద్దిపాడు, చీమకుర్తి, పెద్దారవీడు, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, ముండ్లమూరు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ 39నుంచి 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈఏడాది అత్యధిక ప్రాంతాల్లో సాధారణ వర్షాలు కూడా కురవలేదు. ఆ ప్రభావం ప్రస్తుతం కనిపిస్తున్నది. ఇప్పుడే ఎండల తీవ్రత ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కాగా 40 డిగ్రీల కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు ఇలా ఉన్నాయి. పీసీపల్లి 41.62 డిగ్రీలు, మేకలవారిపల్లి 40.74, అనుమలవీడు 40.74, మోక్షగుండం 40.72, దరిమడుగు 40.55, జువ్విగుంట 40.20, గుండ్లాపల్లి 40.13, వెలిగండ్ల 40.4, గిద్దలూరు 40.02 డిగ్రీలు.

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో వధువు తల్లి, ఇద్దరు బంధువులు మృతి

మరో ముగ్గురికి తీవ్రగాయాలు

అందరూ కందుకూరు వాసులే

కారు అదుపుతప్పి మార్జిన్‌లో దిమ్మెను ఢీకొనడంతో ఘోరం

తూర్పునాయుడుపాలెం సమీపంలో ఘటన


ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలిస్తున్న పోలీసులు

ఒంగోలు(క్రైం), మార్చి 28 : వారంతా నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన వధువు కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు. తెలంగాణలోని పాల్వంచలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. వధూవరులతోపాటు ఇతర బంధుమిత్రులు బస్సులో వస్తుండగా.. వారు కందుకూరు చేరుకునే లోపు ఇంటి వద్ద పనులన్నీ చక్కబెడదామన్న ఆలోచనతో ముందుగా కారులో బయల్దేరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం దాటిన వెంటనే వారి కారు ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రోడ్డుకు రెండో వైపు వెళ్లి మార్జిన్‌లో ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న వధువు తల్లి అరుణ (50), చిన్నమ్మ కుమార్తె శ్రావణి (22), మేనమామ భార్య దివ్య (28) అక్కడికక్కడే మృతి చెందారు. వధువు సోదరుడు వేణు, మేనమామ వినోద్.. ఆయన మూడేళ్ల కుమారుడు అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది.


ప్రమాద స్థలం వద్ద రోదిస్తున్న బంధువులు

గంటలో ఇంటికి చేరుకుంటారనగా ప్రమాదం

వధువు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయాణిస్తున్న కారు మరో గంటలో కందుకూరు చేరుకునేది. ఈలోపే ముగ్గురు మహిళలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. తూర్పునాయుడుపాలెం దాటగానే పెళ్లి బృందం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో కారు 120కిమీ వేగంతో వెళుతున్నట్లు భావిస్తున్నారు. దీంతోపాటు నిద్రమత్తు కూడా కారణమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే హైవే ఎస్సై నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది సాయంతో కారు నుంచి మృతులను, క్షతగాత్రులను బయటకు తీశారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అప్పటికే అక్కడున్న సింగరాయకొండ సీఐ రంగనాథ్‌ను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నుజ్జునుజ్జు అయిన కారు

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, బంధువులు

వెనుకనే వస్తున్న పెళ్లి బస్సు, ఇతర వాహనాల్లో ఉన్న బంధువులు ప్రమాద స్థలం వద్ద దిగి కన్నీరు మున్నీరయ్యారు. దివ్య అక్కడికక్కడే మృతి చెందడం.. ఆమె భర్త, కుమారుడు తీవ్రంగా గాయపడటం అందరినీ కలచి వేసింది. చెల్లి పెళ్లి చేసిన ఆనందం ఇంటికి వెళ్లే వరకు కూడా లేదని, తన తల్లి కళ్ల ముందే ప్రాణాలు విడిచిందని వేణు బోరున విలపించారు. తన కళ్ల ముందే భార్య దివ్య రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి వినోద్ కన్నీటి పర్యంతమయ్యాడు.

పోస్టల్ బ్యాలెట్‌కు 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28 : పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకునే వారు వచ్చేనెల 22వ తేదీలోపు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. అత్యవసర సర్వీసులో ఉండే 33శాఖల ఉద్యోగులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో గురువారం పోస్టల్ బ్యాలెట్లపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు అత్యవసర సేవలు అందించాల్సిన ఉన్నందున ప్రత్యక్షంగా ఓటు వేసే అవకాశం లేని వారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని చెప్పారు. అందుకోసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ఐదు రోజుల్లోపు (వచ్చేనెల 22లోపు) రిటర్నింగ్ అధికారికి ఫారం-12(డి) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ దిశగా శాఖల వారీ వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో ఆర్.శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

దర్శికి వచ్చిన ప్యాసింజర్ రైలు



రైలును చూస్తున్న ప్రజలు

తీరనున్న ప్రజల చిరకాల వాంఛ

దర్శి, మార్చి 28 : ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న దర్శి ప్రాంత వాసుల కల త్వరలోనే నెరవేరనుంది. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం దాదాపు పూర్తయింది. తొలిదశలో నడికుడి నుంచి దర్శి వరకు ఏప్రిల్ నుంచి రైళ్లు నడపాలని అధికారులు నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం ప్యాసింజర్ రైలు తొలిసారిగా దర్శికి వచ్చింది. రైల్వే లైన్ ట్రయిల్ చూసుకునేందుకు అధికారులు రైలును దర్శికి నడిపించారు. ఇప్పటికే దర్శిలో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. కొద్ది రోజుల క్రితం వచ్చిన గూడ్స్ రైలును ప్రజలు చూసేందుకు వెళ్లగా, తాజాగా ప్యాసింజర్ రైలును చూసేందుకు పెద్దఎత్తున తరలి వెళ్లారు.

దర్శిలో మద్దిశెట్టిపై టీడీపీ సర్వే
లోకేష్‌ను కలిసిన రాజేష్
రెండు నియోజకవర్గాలపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి
లోపలి పేజీల్లో...

నేడు గుడ్‌ఫ్రైడే

• ప్రత్యేక ప్రార్థనలకు చర్చిలు ముస్తాబు



జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 28 : గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవ ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. సర్వమానవాళి పాప క్షమాపణ నిమిత్తం యేసుక్రీస్తు శిలువపై మరణించిన పవిత్రదినం పురస్కరించుకుని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ఆయా చర్చిలలో దైవ సేవకులు బోధిస్తారు. ఒంగోలు నగరంలో సెయింట్‌థెరిస్సా చర్చి ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించేలా ఏసుక్రీస్తు శిలువ మోసే కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలోని రాఘవవ మార్టిన్ మెమోరియల్ హాలు ఆవరణంలో ఏడు మాటల ధ్యానం మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు పాస్టర్ డి.ఆషేర్‌పాల్ అధ్యక్షత వహించగా, సీనియర్ పాస్టర్ డి.జాన్ ఆగస్టీన్, మరో ప్రాంగణంలో జాన్ కెనడీ వాక్యోపదేశం చేస్తారు. ఇక రామనగర్ నజరేత్ జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, కబాడిపాలెంలోని పెంతెకోస్తు చర్చిలో, క్లౌపేటలోని ఐఈఆర్ఎఫ్, ఎష్కోలు ప్రార్థన మందిరం, మామిడిపాలెంలోని ఒలీవల ప్రార్థన కొండ, హోసన్నా, బైబిల్ మిషన్ ప్రార్థన మందిరంతో పాటు పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అలాగే గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగను పురస్కరించుకుని గత 40 రోజులుగా ఉపవాస దీక్షతో ప్రార్థన, బైబిల్ పఠనం చేసిన కొందరు క్రైస్తవులు శుక్రవారం ఉపవాస దీక్షను విరమిస్తారు. కాగా ఏసు ప్రభువు మూడవ రోజు మృత్యుంజయుడుగా తిరిగి లేవడాన్నే ఆదివారం రోజున ఈస్టర్ పండుగగా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు.

మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం



సుబ్బమ్మ(ఫైల్)

మద్దిపాడు, మార్చి 28 : మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు తల్లి సుబ్బమ్మ(93) గురువారం రాత్రి వృద్ధాప్యంతో మృతిచెందారు. ఆమె మృతికి జిల్లా, మండలంలోని టీడీపీ నాయకులతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సంతాపం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత వారి స్వగ్రామం బసవన్నపాలెంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

జిల్లాలోనే ఇంటర్ మార్కుల స్కానింగ్

• ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు

ఒంగోలు (విద్య), మార్చి 28 : పని వికేంద్రీకరణలో భాగంగా ఇంటర్ మార్కుల స్కానింగ్‌కు ఈఏడాది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఆయా మూల్యాంకన కేంద్రాల వద్దే ఏర్పాట్లు చేశారు. వచ్చేనెల 4వతేదీతో ఇంటర్మీడియేట్ జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికానుంది. అనంతరం మూల్యాంకన కేంద్రాల్లోనే మిషన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల మార్కులను స్కాన్ చేస్తారు. త్వరితగతిన మార్కుల స్కానింగ్ ప్రక్రియ పూర్తవుతున్నందున ఏప్రిల్ 12 తర్వాత ఒకటి రెండ్రోజుల్లో ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్మీడియేట్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. పార్ట్1 వేరు చేసి ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి తాళం వేస్తారు. గతంలో ఓఎంఆర్ షీట్ పార్ట్-3 విద్యార్థుల మార్కుల వివరాలను వేరుచేసి బోర్డు కార్యాలయానికి పంపితే మార్కులను అక్కడ స్కాన్ చేసేవారు. ప్రస్తుతం ఈ విధానాన్ని మార్చి ఇక్కడే స్కాన్ చేస్తున్నారు. ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలోని మూల్యాంకన కేంద్రంలోనే ఈ ప్రక్రియ మొత్తం జరుగుతుంది.

అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు : ఎస్పీ

ఒంగోలు క్రైం, మార్చి 28: సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న సమయంలో సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలు, అవాస్తవ వార్తలు ప్రచారానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, ఇతర గ్రూపులలో అవాస్తవ సమాచారం ప్రచారం చేస్తే గ్రూపు అడ్మిన్‌లదే బాధ్యతని స్పష్టం చేశారు. అభ్యంతరకరమైన పోస్టింగ్‌లు ఉంచిన సభ్యులను గ్రూపు నుంచి తొలగించాలని ఎస్పీ సూచించారు. అభ్యంతరకరమైన సమాచారం సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేస్తుంటే జిల్లా పోలీసుకు తెలియజేయాలని, ఇందుకోసం వాట్సాప్ నంబరు 9121102266లో సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

బీఎన్ గెలుపు కోసం పాటుపడాలి



మాట్లాడుతున్న వీరయ్యాచౌదరి

నాగులుప్పలపాడు, మార్చి 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా అందరూ సహకరించాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్యాచౌదరి కోరారు. గురువారం రాత్రి కండ్లగుంటలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సైకో పాలనను సాగనంపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మున్నంగి పున్నారెడ్డి, కుంపటి రవి, కొమ్ము క్రాంతికుమార్, వీరేంద్ర, జాషువా, అత్తంటి రాజశేఖర్, పాలపర్తి ఆనంద్, స్వర్ణ కిషోర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది స్వామి భక్తి..!

• బలరాంకాలనీలో సీఎం ఫొటోతో బోర్డు



జగన్ బొమ్మతో ఉన్న బోర్డు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నగరంలో, ప్రభుత్వ కార్యాలయంలో ఏ రాజకీయ నాయకుడు ఫొటోలు గాని, ఫ్లెక్సీలు, విగ్రహాలు ముఖాలు కనిపించ కుండా ఉంచాల్సిన ప్రభుత్వ అధికారులు యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే స్థానిక 3వ డివిజన్‌లోని బలరాంకాలనీలోని సచివాలయం నెం.4లో నేటికీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న సచివాలయ బోర్డును తొలగించలేదు. ఒకవైపు ఎన్నికల కమిషన్ నిబంధనలపై కఠినంగా వ్యవహరిస్తుండగా, అందుకు అనుగుణంగా ఇక్కడి అధికారులు తగు దృష్టి సారించారు. అయితే నేటికి ఆ సచివాలయంలో సీఎం ఫొటో ఉన్న బోర్డును తొలగించకపోవడం పట్ల సచివాలయ సిబ్బంది స్వామి భక్తిని తెలియజేస్తుంది. దీనిపై ప్రజలు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. కోడ్ ఉల్లంఘన చేస్తున్న సిబ్బందిపైనా జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

- ఒంగోలు (కార్పొరేషన్)

గుండ్లకమ్మ ప్రాజెక్టులో మొసలి !

• మత్స్యకారుల వలకు చిక్కి మృతి



మృతి చెందిన మొసలి

మద్దిపాడు, మార్చి 28 : మద్దిపాడు మండలం గుండ్లకమ్మ ప్రాజెక్టులో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుల వలలో మొసలి పడింది. ఒడ్డుకు లాగే సరికి అది మృతి చెందింది. అందిన సమాచారం మేరకు మత్స్యకారులు రిజర్వాయర్‌లో బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లి వల వేశారు. కొద్దిసేపటికి వల బరువుగా ఉండటంతో అనుమానించారు. మరికొందరు జాలర్లను కూడా పిలిచి బయటకు లాగారు. అయితే వలకు ఉన్న హుక్కు మొసలి నోట్లోకి వెళ్లడంతో అది మృతి చెందింది. ఈమేరకు మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీశాఖ అధికారులకు చేరవేశారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి

ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపు • 28వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం




ఓటర్లకు నమస్కరిస్తున్న దామచర్ల జనార్దన్, వృద్ధురాలితో మాట్లాడుతున్న జనార్దన్, రియాజ్ తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 28: రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాల కుటుంబాల్లో సంతోషం కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించి అండగా ఉండాలని టీడీపీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. గురువారం నగరంలోని 28వ డివిజన్ పరిధిలోని గొడుగుపాలెంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి గుడిలో పూజలు చేసిన అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు సీఎం అయిన వెంటనే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ప్రజల ఆశీస్సులతో 2014లో ఎమ్మెల్యేగా గెలుపొంది ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకున్నానని తెలిపారు. మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని దామచర్ల కోరారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.163 కోట్లు అమృత్ నిధులు మంజూరు చేయించి, గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు తాగునీరు తీసుకొచ్చినట్లు తెలిపారు. నగరంలో పార్కుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, బ్రిడ్జిలు, హైమాక్స్ లైట్లు తదితర అభివృద్ధి పనులు తన హయాంలోనే చేసినట్లు చెప్పారు. ప్రజలుకు సేవ చేసేందుకు మరో అవకాశం కల్పించాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు ఒక్క అభివృద్ధి పనిచేయలేదన్నారు. చెత్తపైన పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో ప్రజల ముందుకు వస్తున్న కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తాను అనిన వేళలా అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు దామచర్లకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు కొరారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, మదన్, పోతంశెట్టి పవన్‌కుమార్, కత్తుల శివశంకర్, శేఖర్, భవానీ, కోటయ్య, సుధీర్, పలువురు టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్



బీఎన్‌కు బొకే ఇస్తున్న బీజేపీ నాయకులు

• ఎస్ఎన్‌పాడు టీడీపీ అభ్యర్థి బీఎన్

మద్దిపాడు, మార్చి 28: మహిళల ఆర్థికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం ఇనమనమెళ్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు మహిళలకు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికాభివృద్ధి చెందేవరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. చంద్రబాబు హయాంలోనే మహిళలకు ఎంతో మేలు జరిగిందన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, అడక స్వాములు, నైనాల భవన్నారాయణ, గుద్దేటి సురేష్‌బాబు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

సంతనూతలపాడు: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్ కుమార్‌ను గురువారం ఒంగోలులోని తన కార్యాలయంలో మండల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ్‌కుమార్ గెలుపునకు కృషిచేస్తామని తెలిపారు. అదేవిధంగా టీడీపీ, జనసేన నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దుంపా కోటిరెడ్డి, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు జి.సురేష్, నాయకులు ఆర్.వెంకట్రావు, వాసు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి ఆలయంలో పూజలు

పి.తక్కెళ్లపాడు గ్రామంలో గురువారం జరిగిన శ్రీరాములవారి గుడిప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి బీబీఎస్.విజయ్‌కుమార్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, నరసింహారావు, శ్రీనివాసరావు, అంకరాజు, వీరయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి • బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28 : రాష్ట్రంలో అరాచక పాలనను కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇంటికి సాగనంపేందుకు ఎన్‌డీఏ కూటమి భాగస్వామ్య పార్టీలు పని చేస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి తెలిపారు. ఒంగోలులోని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు అరాచక పాలనను కొనసాగిస్తుందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామిగా పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా బీజేపీ అభ్యర్థులు పోటీలో లేకపోయినా టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థుల విజయం కోసం పని చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకొని వైసీపీ ఓటమి లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. అందుకోసం మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకొని తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి పని చేస్తామని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ మాట్లాడుతూ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, శెగ్గం శ్రీనివాసరావు, బొద్దులూరి ఆంజనేయులు, రాయపాటి అజయ్‌కుమార్, రవిశంకర్, రాజశేఖర్, శివకుమారి, తిరుమల, ప్రియారాధిక, సుల్తాన్‌బి, ధనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున లైసెన్సులు కలిగిన ఆయుధాలను తిరిగి డిపాజిట్ చేయించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కొత్తగా ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లైసెన్సుడ్ ఆయుధాల డిపాజిట్, లైసెన్సు లేని ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాల స్వాధీనం, వాటి రవాణాను అడ్డుకోవడం తదితర అంశాలపై ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యక్తిగత లైసెన్స్ ఆయుధాలను అందరూ తిరిగి డిపాజిట్ చేసేలా చూడాలన్నారు. లైసెన్సుల జారీ, ఆయుధాల రకాలకు సంబంధించి వివరాలతో కూడిన రిజిస్టర్‌లను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ అధికారుల మధ్య కామన్‌డేటా ఉండాలన్నారు. లైసెన్స్‌దారుడు చనిపోతే వారి వద్ద ఉన్న ఆయుధాల స్థితిగతులు, రాజకీయ నేపథ్యం ఉన్న ఖైదీలు జైలులో నుంచి ప్రతివారం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కాల్‌డేటా వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. శాంతియుత ఎన్నికల నిర్వహణపై ఇలాంటి ఖైదీలు ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపకుండా గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్‌దారులు తమ ఆయుధాలను డిపాజిట్ చేసేలా ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి లైసెన్స్ ఆయుధంపైన ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. గుర్తింపు లేని ఆయుధాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఇలాంటివి రవాణా జరగకుండా నిఘా పెట్టినట్టు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణి, బంధువులపై ఆసుపత్రి సిబ్బంది దౌర్జన్యం

• పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



దౌర్జన్యం చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

చీమకుర్తి, మార్చి 28 : కాన్పు కోసం వచ్చిన గర్భిణీకి రెండురోజులపాటు వైద్యసేవలు అందించి హుటాహుటిన పరిస్థితి సీరియస్‌గా ఉందని, వెంటనే ఆసుపత్రిని నుంచి వెళ్లిపోండి అంటూ సిబ్బంది పేషంట్‌ని పంపించే క్రమంలో ఆసుపత్రి సిబ్బందికి, బంధువులకు మధ్య ఘర్షణ నెలకొంది. ఈ సంఘటన చీమకుర్తి పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం జరిగింది. మార్కాపురం పట్టణానికి చెందిన కె.శ్వేత అనే గర్భిణి ప్రసవం నిమిత్తం బుధవారం చీమకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇన్‌పేషంట్‌గా చేర్చారు. ఫ్రీ డెలివరి అవుతుందని, ఏమి కంగారు పడకండి అంటూ రెండురోజుల పాటు చెప్పి వైద్యసేవలు అందించిన ఆసుపత్రి సిబ్బంది గురువారం సాయంత్రం ఒక్కసారిగా పేషంట్‌కి సీరియస్‌గా ఉంది.. వేరే ఆసుపత్రికి తీసుకెళ్లండి అంటూ చెప్పారు. దీంతో పేషంట్ బంధువులు అవాక్కయ్యారు. ఈక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పేషంట్ బంధువులపై దురుసుగా ప్రవర్తించటంతో ఘర్షణ నెలకొంది. అదే సమయంలో సీఐ దుర్గాప్రసాద్ ఆసుపత్రి వద్దకు వచ్చి సముదాయించారు. పేషంట్ బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఆసుపత్రి సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

అవీ..ఇవీ..

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు సెలవులు

• ఆర్ఐవో సైమన్‌విక్టర్

ఒంగోలు(విద్య), మార్చి 28: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ గురువారం తెలిపారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 1వ తేదీన కళాశాలలు పునః ప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలన్నింటికీ ఈ ప్రకటన వర్తిస్తుందన్నారు. సెలవు రోజుల్లో కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బోర్డు నిబంధనలు, ఆదేశాలు ఉల్లంఘించి తరగతులు, అడ్మిషన్లు, కోచింగ్‌ల పేరుతో ఎటువంటి తరగతులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే బోర్డు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని, అపరాధరుసుం విధింపుతో పాటు కళాశాలల గుర్తింపు సైతం రద్దు చేస్తామని ఆర్ఐవో హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28: ఒంగోలులోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. స్థానిక శర్మా కాలేజీ, సెయింట్‌తెరిస్సా హైస్కూల్‌లను ఆయన పరిశీలించి ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో బారికేడ్ల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాల కల్పన మొదలైన అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోడ్ కట్టుదిట్టంగా అమలు చేయాలి

మద్దిపాడు, మార్చి 28: ఎన్నికల కోడ్‌ను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం మండలంలోని కొలచనకోట, తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల్లోని రాజకీయ పోస్టర్లు, హోర్డింగులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీఈవో శంకర్, ఏఈ హేమలత, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో రెండు దూడలు మృతి

మద్దిపాడు, మార్చి 28: మద్దిపాడులోని డీఆర్‌డీఏ ఆఫీస్ సమీపంలో గురజాల నాగేంద్రం పశువుల కొష్టాంలో గురువారం పశువులపై కుక్కలు దాడి చేశాయి. రెండు దూడలు మృత్యువాత పడ్డాయి. మరికొన్ని పశువులకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు తనకు రూ.60 వేల నష్టం వాటిల్లిందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయలని కోరారు. గ్రామంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగి మనుషులు, పశువులపై దాడులకు పాల్పడుతున్నాయని, వాటిని నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

క్విస్, లూకాస్ టీవీఎస్‌ల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), మార్చి 28: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, చెన్నైలోని లూకాస్ టీవీఎస్ కంపెనీల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ.హనుమంతరావు, లూకాస్ టీవీఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయకుమార్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా క్విస్ విద్యార్థుల పారిశ్రామిక శిక్షణ నియామకాలు, అతిథి ఉపన్యాసాల్లో పాల్గొనవచ్చు. కార్యక్రమంలో క్విస్ మెకానికల్ విభాగాధిపతి జి.నవ్యనిత్‌కృష్ణణ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కాగా క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం సమాంతర అల్గారిథమ్స్‌పై తిరుచిరాపల్లి ఎన్ఐటీ ప్రొఫెసర్ కె.కన్నాదాసన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సూర్యకళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపాల్ హనుమంతరావు, విభాగాధిపతి బుజ్జిబాబు, కో కన్వీనర్ నిడమానూరి శ్రీను పాల్గొన్నారు.

రేపు సీఏఏ అమలుపై నిరసన ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28 : కేంద్రప్రభుత్వం తెచ్చిన సీఏఏ అమలు కాకుండా ప్రతి ఒక్కరు అడ్డుకునేందుకు ముందుకు రావాలని వామపక్ష, కాంగ్రెస్, లోకసత్తా పార్టీ నాయ కులు కోరారు. ఈనెల 30న ఒంగోలులో జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిరసన ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేఖరుల సమావేశం లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హానీఫ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా, లోక్‌సత్తా పార్టీ నాయకుడు ఎస్‌కే.రఫీలు మాట్లాడుతూ నగరంలో జరిగే నిరసన ప్రదర్శనలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్‌అజిత్ బాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొంటారన్నారు. సీఏఏ అమలును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని ప్రకటించిన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నగ రంలో జరిగే నిరసన ర్యాలీలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు అధిక సంఖ్యలో పా ల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌సర్దార్, పీవీఆర్.చౌదరి, ఎంఎ.సలార్, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయంపదిన్నర గంటలకు స్థానిక గుంటూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో జరిగే టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి హాజరవుతారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ఒంగోలు క్రైం, మార్చి 28: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు గత 20 రోజులుగా మృత్యువుతో పోరాడి గురువారం ఉదయం చనిపోయారు. వివరాలోకి వెళితే.. ఒంగోలు నగరం అంబేడ్కర్ భవనం వద్ద ఉన్న ఇందిరకాలనీకి చెందిన మన్నం వెంకట్‌ప్రక్వీత్, తన స్నేహితుడు దేవరపల్లి అనుదీప్‌రెడ్డి బైక్‌పై ప్రయాణిస్తూ ఈనెల 9వ తేదీన రాత్రి కర్నూల్‌రోడ్డులోని పవర్ ఆఫీస్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. బైక్ అత్యంత వేగంగా తోలుతూ అదుపు తప్పి కింద పడటంతో వెంకట్ ప్రక్వీత్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో 20 రోజులుగా ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వెంకట్‌ప్రక్వీత్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. అయితే వెంకట్‌ప్రక్వీత్ ఈనెల 21వ తేదీన ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్ళాల్సి ఉండగా రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, మార్చి 28: గ్రంథాలయాలను సద్వినియాగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఉప్పుగుండూరులోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సభ్యత్వ నమోదను పెంచాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఎ.ప్రసాద్, సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ తదతరులు పాల్గొన్నారు.

పేదలకు సహాయ పడటమే సమాజ సేవ

ఒంగోలు(కల్చరల్), మార్చి 28: పేదలకు సహాయపడటమే నిజమైన సేవ అని నగర అభివృద్ధి కమిటి అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం సంతపేటలోని శివం అనాథ శరణాలయంలో నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రముఖ హోటల్ వ్యవస్థాపకులు మస్తాన్ వర్థంతి సందర్భంగా ఆయన కుమారుడు నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, షేక్ మీరామొహిద్దీన్, మస్తాన్, హజరత్, కరిముల్లా పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ

నాగులుప్పలపాడు మార్చి 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కిషోర్‌కుమార్ హెచ్చ రించారు. గురువారం మండలంలోని మాచవరం, రాపర్ల, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించండి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య

పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

45 రోజులు అవిశ్రాంతంగా పనిచేయాలని పిలుపు

సింగరాయకొండ, మార్చి 28 : రాష్ట్రంలో ఐదేళ్లు అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మూడు పార్టీలు ఎన్నికల్లో జత కలిశాయని చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో గ్రామాల్లో వైసీపీ కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, దాడులకు తెగబడటం, అక్రమ కేసులు బనాయించడం, వేధింపులకు గురిచేయడం తప్ప అభివృద్ధిపై వైసీపీ నాయకులు దృష్టి పెట్టలేదని విమర్శించారు.

పాకలలో..

పాకల పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, పాత ఊరు, చెల్లమ్మగారిపాలెం, పోతయ్యగారిపాలెం, క్రాంతినగర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సత్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేసిన ఏకైక పార్టీ టీడీపీనేనని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణంతో పాటు పాకల బీచ్‌లో టూరిజం అభివృద్ధి చేయటానికి రూ.4కోట్లతో టూరిజం రెస్టారెంట్ పనులను ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అర్ధంతరంగా నిలిపివేసిందని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో స్థానికుడైన ఎమ్మెల్యే స్వామిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మనోజ్‌కుమార్ టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వేల్పుల సింగయ్య, రాజేష్ సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, సన్నెబోయిన శ్రీనివాసులు కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీచౌదరి, రాయపాటి సీతమ్మ, చంటి, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, రాజగోపాల్‌రెడ్డి, రేణుమాల పోతురాజు, కోటేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల సత్య

ఊళ్లపాలెంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఊళ్లపాలెంలో మత్స్యకార బాలికల కోసం గురుకుల పాఠశాలను తీసుకొచ్చామని సత్య గుర్తు చేశారు. పాఠశాల నిర్మాణానికి భూమిని కేటాయిస్తే వైసీపీ వచ్చాక ఆభూమిలో జగనన్న లేఅవుట్ వేయటం దుర్మార్గమన్నారు. గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధిని పూర్తిచేయాలంటే కూటమి అభ్యర్థి స్వామికి ఓటువేయాలని కోరారు. టీడీపీ నేతలు బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, కష్ణచైతన్య, నాయుడు జనార్దన్, కొక్కిలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బింగినపల్లిలో..

బింగినపల్లిలో సత్య మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామంలోని అన్ని మట్టిరోడ్లను సీసీరోడ్లగా మార్చామని చెప్పారు. నాలుగు శ్మశానవాటికలను నిర్మాణం చేశామన్నారు. ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేశామని గుర్తు చేశారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి గ్రామంలో పార్టీకి మెజారిటీని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులి ప్రసాద్, మాలకొండయ్య, సన్నెబోయిన మాలకొండయ్య, రోశిరెడ్డి, నూకసాని నరసింహ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, పెద్దన్నబోయినవారిపాలేనికి చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలు సత్య సమక్షంలో టీడీపీలో చేరారు.

మూలగుంటపాడులో..

మూలగుంటపాడులో సత్య మాట్లాడుతూ రామతీర్థం నీటిని గ్రామానికి తీసుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అధికారంలోకి రాగానే అమలుచేసే సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, సన్నెబోయిన వెంకటేశ్వర్లు, అంబటి శ్రీను, మల్లికార్జున, సన్నెబోయిన శ్రీను, చల్లా శ్రీనివాసరావు, వెంకట్రావు పాల్గొన్నారు.



చెక్‌పోస్ట్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ, మార్చి 28 : ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మూలగుంటపాడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్ సజావుగా జరిగేటట్లు చూడాలని చెప్పారు. అనంతరం ఉలవపాడు, సింగరాయకొండ మధ్య ఉన్న జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును కలెక్టర్ పరిశీలించారు. తనిఖీ వివరాలను నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవానీ శంకర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థిని

సింగరాయకొండ, మార్చి 28 : జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు పాకల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.సిపోరా ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన 49వ రాష్ట్ర అంతర జిల్లాల సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈ నెలాఖరు నుంచి బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో సిపోరా పాల్గొంటుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు పి. హజరత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



సిపోరా

నేడు టంగుటూరులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

టంగుటూరు, మార్చి 28 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని టంగుటూరులోగల ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను గురువారం తెలిపారు.జుండా ఆవిష్కరణలో గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు గ్రామాల్లోనే జరుపుకోవాలని గ్రామాల పార్టీ అధ్యక్షులకు మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడే కార్యక్రమం జరుపుకునేలా అధికారుల అనుమతి పొందామని వివరించారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం



హజరత్తయ్య



జబ్బార్

అద్దంకి, మార్చి28: అద్దంకి బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడుగా రావి హజరత్తయ్య, వై ఎస్ ప్రెసి డెంట్‌గా శానం నాగేశ్వరరావు, కార్యదర్శిగా జబ్బార్, జాయింట్ సెక్రటరీగా సత్యవతి, ట్రెజరర్‌గా హరిబాబు, మహిళా ప్రతినిధిగా కుసుమలతతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియను న్యాయవాది ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

దర్శిలో మద్దిశెట్టిపై టీడీపీ సర్వే

- లోకేష్‌ను కలిసిన రాజేష్
- రెండు నియోజకవర్గాలపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీ దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికతోపాటు కందుకూరు నియోజకవర్గ పార్టీలో నెలకొన్న విభేదాలపై దృష్టి సారించింది. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయని దర్శి నియోజకవర్గానికి గురువారం సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌పై ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. మరోవైపు కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఆపార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌ను పిలిపించి నారా లోకేష్ మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకూ 11 నియోజకవర్గాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించిన విషయం విదితమే. తొలుత జనసేనకు కేటాయించిన దర్శి నియోజకవర్గం బీజేపీతో పొత్తు అనంతరం తిరిగి టీడీపీ ఖాతాలోకి చేరింది. దీంతో ఇప్పటికే అక్కడ టికెట్‌ను ఆశిస్తున్న పలువురు అభ్యర్థుల విషయంలో పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకునేందుకు సర్వే చేసి ఉన్నారు. కొద్దిరోజుల క్రితం మాజీమంత్రి శిద్దా రాఘవరావు టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఆవైపు దృష్టి సారించారు. అయితే మంగళవారం సీఎం జగన్‌ను శిద్దా కలిసివచ్చిన తర్వాత ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆయన వైసీపీలోనే కొనసాగబోతున్నారు. తదనంతరం మద్దిశెట్టి పేరుపై సర్వే చేయించడం చర్చనీయాంశమైంది. వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న మద్దిశెట్టిని ఆపార్టీ పక్కనపెట్టింది. ఆయన వైపు నుంచి టీడీపీలో చేరే సంకేతాలు వెళ్లినందునే తాజా సర్వే చేపట్టిందని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటికే కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు అసెంబ్లీ స్థానాలకు రెడ్డి సామాజికవర్గం వారిని అభ్యర్థులుగా టీడీపీ ఎంపిక చేసింది. ఎర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాలు దళితులకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఒంగోలు నుంచి కమ్మ సామాజికవర్గానికి చెందిన జనార్దన్ పోటీలో ఉన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంతవరకూ అవకాశం ఇవ్వని కొన్ని సామాజికవర్గాలలో కాపులకు దర్శి నుంచి చాన్స్ ఇస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ఆపార్టీ దృష్టిపెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగానే నిన్నమొన్నటి వరకు శిద్దా విషయంలో ఆలోచించిన అధిష్ఠానం తాజాగా కాపు సామాజికవర్గానికి చెందిన మద్దిశెట్టి పేరును పరిశీలనలోకి తీసుకుని పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తీసుకునేందుకు సర్వే చేసినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొంతకాలంగా నియోజకవర్గంలోని అనుచరులకు అందుబాటులో లేని మద్దిశెట్టి గురువారం అనుచరులతో పాటు, టీడీపీ స్థానిక నాయకుల్లో కొందరితో కూడా మాట్లాడినట్లు తెలిసింది. ఇప్పటికే గరికపాటి వెంకట్, గొట్టిపాటి లక్ష్మి, బాచిన కృష్ణచైతన్య, హర్షిణి రవికుమార్‌ల పేర్లు కూడా ఆపార్టీ పరిశీలనలో ఉన్నాయి. ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మార్కాపురం రానుండగా ఈలోపు దర్శి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

రాజేష్‌తో మాట్లాడిన లోకేష్

కందుకూరు అసెంబ్లీ నుంచి రంగంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఇంటూరి రాజేష్‌తో గురువారం లోకేష్ మాట్లాడారు. సాయంత్రం హైదరాబాద్‌లో లోకేష్‌ను రాజేష్ కలిశారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీలో ఉంటే తాను వ్యతిరేకించడం ఖాయమని, ఆవిషయాన్ని గతంలోనే స్పష్టం చేశానని తేల్చిచెప్పినట్లు తెలిసింది. మీరు మంగళగిరి వచ్చి పనిచేయండి, భవిష్యత్తులో మంచి అవకాశం ఇస్తామని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీని తన అనుచరులు అంగీకరించడం లేదని, వారితో మాట్లాడాలని సమాధానమిచ్చినట్లు సమాచారం. నాగేశ్వరరావుతో కలిసి పనిచేయాలని, మీ అనుచరులతో మాట్లాడుకుని పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడవాలని లోకేష్ సూచించారు. ఏ విషయాన్ని ఒకట్రెండురోజుల్లో తేల్చిచెప్పాలన్న లోకేష్. పార్టీ జెండాలతో ఇద్దరు వ్యక్తులు నియోజకవర్గంలో తిరగడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసినట్లు సమాచారం.

మాదిగల ద్రోహి జగన్..!

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నాగరాజు
- వైసీపీ పాలనలో దళితులపై దాడులు
- టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర



డాక్టర్ ఉగ్రను పూలమాలవేసి ఘనంగా సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, మార్చి 28: ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ చేస్తామని మాదిగలను నమ్మించి వంచించిన ద్రోహి జగన్‌రెడ్డి అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం కూటమి సంఘీబావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తన తండ్రి చివరి కోరిక అని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మా ట తప్పిన మాదిగ ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు. వైసీపీ వచ్చాక దళితులపై దాడులు పెచ్చురిల్లాయన్నారు. పైకి మాత్రమే నా ఎస్సీలు అంటూనే లోలోపల ఎస్సీలను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మళ్లీ జగన్‌కు అధికారాన్ని కట్టపెడితే ఇక బడుగు, బలహీన వర్గాల మనుగడ కష్టమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి గెలుపుకోసం మాదిగలంతా ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. మాదిగల తలరాతలు మారాలంటే రాష్ట్రంలో టీడీపీ, కనిగిరిలో డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి అత్యధిక మెజార్టీతో మాదిగలు గెలిపించాలని కోరారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులపై దాష్టీకాలు, దాడులు చేస్తూ మారణకాండను సృష్టించారని డాక్టర్ ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు దళితుల పక్షపాతి అని బైబిల్‌తో ప్రచారాలు చేసే జగన్‌కు ఆయన కుటుంబానికి చిన్నచూపుగా ఉంటారని ఆరోపించారు. మాదిగల సంక్షేమ పాలన రావాలంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని కోరారు. వైసీపీ పాలనలో జగన్ ఎస్సీ కార్పొరేషన్‌ను నీరుగార్చి, వారి అనుయాయులకు ముట్టచెప్పి కమీషన్‌లను తాడేపల్లి ప్యాలెస్‌కు మళ్లించారన్నారు. మాదిగలంతా తనను ఆదిరించి గెలిపిస్తే రుణపడి ఉంటానని, అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చే స్తానని డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ ఉగ్రను ఎమ్మార్పీఎస్ నాయకులు పూలదండలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాశం, జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తోరేటి ఆనంద్‌మాదిగ, రావినూతల కొండ య్య, బీజేపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి జవసత్వాలు

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలన్న లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కొటికలపూడి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, వేలమూరిపాడు, కొంగ పాడు, మణికేశ్వరం, విప్పర్లవారిపా లెం, నాగులపాడు, జార్లపాలెం, చె రువుకొమ్ముపాలెం, బొమ్మనంపాడు, ఉప్పలపాడు, గోవాడ త దితర గ్రా మాల నేతలతో గురువారం పంగు లూరు మండలం ముప్పవరం వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మె ల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధి కారంలోకి వచ్చిన తరువాత సాగునీటి ప్రా జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గుండ్లకమ్మ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పేదవాడి కడుపు నింపే అన్నా క్యాంటిన్‌లు తెరిపిస్తామన్నారు. టీడీపీ అధి కారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు క ల్పి స్తా వ ు ని చెప్పారు. టీడీపీ చేపట్టిన ప్రజాగళంతో వైసీపీ బంగాళాఖాతంలో కలిసిపోవ టం ఖాయమన్నారు.

కార్యక్ర మంలో టీడీపీ నేత లు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, జొన్నలగొడ్డ గోపి, నర్రా వీరయ్య, గాలం శ్రీనావాసరావు, పూనాటి విక్రమ్, కంచర్ల వెంకటరావు, జ్యోతి రామారావు, మోటుపల్లి నాగేశ్వరరావు, దివికోలు రాధాకృష్ణమూర్తి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన గుడిపూడి బ్రహ్మయ్య, తదితరులు

టీడీపీలో కొంగపాడు సర్పంచ్

వర్గీయుల చేరిక

అద్దంకి : మండలంలోని కొంగ పాడు సర్పంచ్ గుడిపూడి రమాదే వి బ్రహ్మ య్యతో పాటు పలువురు గురువారం ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీకి గ్రామలో మ రింత మెజార్టీ వచ్చే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా రవి కుమార్‌కు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో పెళ్లిచేశారంటూ యువతి బంధువుల ఆందోళన

ఒంగోలు(క్రైం), మార్చి28 : పోలీస్ స్టేషన్‌లో మేయర్ ఒత్తిడితో పోలీసులే పెళ్లి చేశారంటూ యువతి తరపు బంధువులు ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. వెంగముక్కపాలెంకు చెందిన దాసరి వంశీ అదే గ్రామానికి చెందిన యువతిని కాలేజీ నుంచి తన వెంట తీసుకెళ్లాడని యువతి బంధువులు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. అయితే వారిద్దరూ నేరుగా పోలీసులను ఆశ్రయించారు. తాము పెళ్లి చేసుకున్నామని వారు చెప్పుండగా, పోలీస్ స్టేషన్‌లో బలవంతంగా తాళి కట్టించారని యువతి బంధువులు ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్ వద్ద అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. ఆదేక్రమంలో యువకుడికి మద్దతుగా మేయర్ ఒత్తిడి మేరకు పోలీసులు తలొగ్గి పెళ్లి చేశారని బంధువులు ఆరోపించారు. ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు స్టేషన్‌కు చేరుకొని యువతీయువకులతో మాట్లాడి యువతిని హోంకు పంపించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న యువతి బంధువులపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు.

పది క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీ

బల్లికురవ, మార్చి 28: మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో వల్లెపు శ్రీను అనే రైతుకు చెందిన పంట పొలంలో పది క్వింటాళ్ల మిర్చి బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. సంతమాగులూరు మండలం కొప్పరంకు చెందిన వల్లెపు శ్రీను అనే రైతు బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేశాడు. కోత కోసిన మిర్చి పంట పొలంలో ఎండటానికి ఉంచగా గుర్తు తెలియని దొంగలు సుమారు పది క్వింటాళ్ల మిర్చిని తస్కరించారు. గురువారం పొలం వద్దకు వచ్చిన రైతు మిర్చి చోరీ జరిగిన విషయం గుర్తించి వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

- 8 మంది అరెస్ట్, రూ.2,21,400 నగదు స్వాధీనం

పర్చూరు, మార్చి 28: పేకాట శిబిరంపై బాపట్ల జిల్లా పోలీసులు మెరుపుదాడి చేశారు. పర్చూరు మండలం వీరన్నపాలెం - రమణాయపాలెం రోడ్డులోని నల్లగుంట డొంక వద్ద పేకాల స్థావరంపై గురువారం మధ్యాహ్నం మెరుపు దాడిచేసి భారీ మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్‌కు అందిన సమాచారం మేరకు అయన ఆదేశాలతో.. డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం, పర్చూరు ఎస్సై ఎస్.రమేష్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటుచేసి ఏకకాలంతో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.2,21,400 నగదుతోపాటు, 9 ద్విచక్ర వాహనాలు, 18 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకుసంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందాలతో మెరుపు దాడి చేసినట్టు చెప్పారు.

ఆలయ ఈవో సస్పెన్షన్

చీరాల, మార్చి 28 : వేటపాలెం మండలం కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో జీవీఎల్ కుమార్‌ను గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. చీరాల సత్రం ఖాతాకు సంబం ధించి రూ.32 లక్షలు అనధికారికంగా డ్రా చేసినట్లు నేరెళ్ల గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరపగా నిధులు డ్రా చేసినట్లు ధ్రువీకరణ కావటంతో కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- పార్టీలో చేరిన యువకులు

మార్టూరు, మార్చి 28: రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యపడుతుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం సాయంత్రం మార్టూరులోని తూర్పుబజారున ఉన్న వినాయక స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తూర్పుబజారుకు చెందిన వైసీపీకి చెందిన సీనియర్ నేత కొనకంచి మురళి తన అనుచరులతో ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరినవారిలో రొంపిచర్ల గోపు వెంకట్రావు, సత్తెనపల్లి పరశురాం, తానికొండ గంగయ్య కొల్లా బ్రహ్మం, తొండెపు శ్రీను, కొనకంచి సాంబయ్య , పొట్రు శ్రీను ఉన్నారు. అలాగే, విజయనగర్ కాలనీకి చెందిన కొమెర వెంకట్రావు, కొమ్మెర అంకమ్మ రావు, కొమ్మెర ప్రభాస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి భుజంగరావు, జంపని సాంబశివరావు, శానంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో తెలుగుతమ్ముళ్ల ప్రచారం



పర్చూరులో ఎన్నికల ప్రచారంలో తెలుగు తమ్ముళ్ళు

పర్చూరు, మార్చి 28: పర్చూరులో తెలుగుదేశం పార్టీ గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. పర్చూరు గ్రామ దేవత శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ప్రారంభించారు. తొలిరోజే పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ శ్రేణులు తరలిరావటంతో పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. ఇంటింట తిరిగి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి సుబ్బారావు, మామిడిపాక హరిప్రసాద్, తంగెళ్ళ మల్లిఖార్జునరావు, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, ఆకుల మధుబాబు, దూళిపల్లి వెంకటస్వామి, గడ్డిపాటి శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, మక్కెన శేఖర్‌బాబు, లక్కిపోగు సుమన్, చెరుకూరి శ్రీధర్ (చింపయ్య), శ్రీరాం వెంకటసుబ్బారావు, ఊటుకూరి నిర్మల, తులసి కోటేశ్వరమ్మ, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమాదేవి, పఠాన్ బాజీ, షేక్ బషీర్, కట్టెంపూడి జీవన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీ లో చేరిన తూర్పు బజారు, విజయనగర్ కాలనీ యువకులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పర్చూరు, మార్చి 28: అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కారంచేడు నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులంతా కలసికట్టుగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి అప్పులపాలు చేశారని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ కోసం మాత్రమేనన్నారు. దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలనే లక్ష్యంతో మూడు పార్టీలు జత కట్టాయని వివరించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బరితెగించి ఆక్రమణలు

- జాతీయ రహదారి వెంబడి అడ్డగోలుగా నిర్మాణాలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



కట్టడం నిలిపివేయాలని సూచిస్తున్న వీఆర్వో

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28: మార్కాపురం పట్టణంలో భూఆక్రమణదారులు రోజురోజుకు పెరుగుతున్నాయి. కాస్త జాగ కనిపిస్తే చాలు పాగా వేసి బరితెగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. జాతీయ రహదారులను కూడా ఆక్రమణదారులు వదలడం లేదు.

మార్కాపురం పట్టణంలోని 2వ వార్డు ఏకలవ్య కాలనీ పారిశ్రామికవాడ వద్ద 565 జాతీయ రహదారి వెంబడి యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ ఛైర్మన్ బంధువైన ఒక వ్యక్తి ఈ అక్రమ కట్టడాన్ని నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో మురుగు పారేందుకు ఏర్పాటు చేసిన కాలువ, ఆర్అండ్‌బీ స్థలాన్ని కూడా కూడా ఆక్రమించి దుకాణాలను నిర్మిస్తున్నాడు. గతంలో మస్తాన్ అనే వ్యక్తి సైకిల్ షాపు, పుల్లయ్య అనే వ్యక్తి చికెన్ షాపులు పెట్టుకుని ఇక్కడ జీవనం సాగిస్తుండేవారు. కానీ మున్సిపల్ ఛైర్మన్ అయిన ఒక వ్యక్తి వారిని బలవంతంగా ఖాళీ చేయించాడు. అనంతరం కాలువ, ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి 80 అడుగుల పొడవు విస్తీర్ణంలో దుకాణాల నిర్మాణం చేపట్టాడు. సమాచారం అందుకున్న 2వ సచివాలయం వీఆర్వో వెళ్లి అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని అన్నారు. కానీ ఆక్రమణదారులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. ఎన్నికల సమయంలో అధికారులు బిజీగా ఉంటారనే సమయం చూసుకుని రాజకీయ నాయకుల ప్రోద్బలంతో అండదండలతో నిర్మిస్తున్న స్థలాన్ని ఆక్రమణ దారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



హైవే కాలువపై నిర్మించిన అక్రమ కట్టడం

పెట్రోలు పంపు మాటున

మార్కాపురం రూరల్ : ఆక్రమణదారులు ప్రభుత్వ భూములతో పాటు జాతీయ రహదారులను కూడా ఆక్రమించేందుకు వెనుకాడడం లేదు. రహదారి పక్కనే నిర్మాణాలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని అమరావతి టూ అనంతపురం 544డీ జాతీయ రహదారిపై నికరంపల్లి-కోమటికుంట మధ్యలో నూతనంగా ప్రైవేటు పెట్రోల్ బంకు నిర్మాణం జరుగుతోంది. పెట్రోల్ బంకుకు సంబంధించిన పార్క్ నిర్మాణం కోసం జాతీయ రహదారిని సైతం సదరు యజమాని ఆక్రమించారు. సాధారణంగా ఈ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. రహదారి అంచులలో వాహనాలు నిలిపితే సంబంధిత అధికారులు వాహన దారులపై చర్యలు తీసుకుంటారు. అలాంటిది ఏకంగా జాతీయ రహదారిని ఆక్రమించి ప్రైవేట్ వ్యక్తి ధైర్యంగా పార్కును ఏర్పాటు చేస్తున్నాడు. ఇదే రహదారిపై నిత్యం జాతీయ రహదారి పెట్రోలింగ్ పోలీసులు పర్యవేక్షిస్తుంటారు. కానీ ఆక్రమణదారునిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తక్షణమే జాతీయ రహదారి ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుని నిర్మాణాలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారి వెంబడి నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు

అవీ.. ఇవీ..

ప్రశాంతంగా తిరునాళ్ల నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం రూరల్, మార్చి 28: శ్రీ వేణుతల కాటంరాజు తిరునాళ్ల ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏప్రిల్ 9న ఉగాది పర్వదినం సందర్భంగా జరగనున్న కాటంరాజు తిరునాళ్ల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలతో ముడిపడిన ఎటువంటి కార్యక్రమాలు చేయడానికి వీలులేదన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు వివిధ శాఖల అధకారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎర్రగొండపాలెం సీఐ రాములు నాయక్, పెద్దారవీడు ఎస్, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

- రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు సీఐ విజ్ఞప్తి



మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

మార్కాపురం రూరల్, మార్చి 28: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని పెద్ద యాచవరం, మొద్దులపల్లి గ్రామాలలో రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్‌తో కలిసి ప్రజలకు, రాజకీయ నాయకులకు ఎన్నికల నేపథ్యంలో గురువారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలలో ఎవరికి వారు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తామన్నారు. గొడవలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రజల సహకారం ఉంటే ఎన్నికలు సమర్థవంతంగా జరుగుతాయన్నారు. గ్రామంలో వర్గవిభేదాలు లేకుండా మీకు నచ్చిన వ్యక్తులకు ఓటు వేసుకోవాలన్నారు.

కోడ్ ఉల్లంఘటనలపై ప్రత్యేక కాల్‌సెంటర్

గిద్దలూరు, మార్చి 28 : నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే వారిపై కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చని రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో కోడ్ ఉల్లంఘన జరిగితే స్థానికులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా గిద్దలూరులోని తమ కార్యాలయంలో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని, 8639383409 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పొదిలి, మార్చి 28 : రానున్న ఎన్నికల్లో ప్రచారం చేయాలన్నా, పోస్టర్లు పంచాలన్నా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు వినియోగించే ప్రచార వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని, ఏవిషయమైనా సంబంధిత అధికారులతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆ మేరకు అవకాశం కల్పించిందన్నారు. కనుక బీఎల్వోలు గ్రామాల్లో ఇంటివద్ద ఏ విధంగా ఓటు వేయాలనే విషయాన్ని స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం నిబంధనలు తూచా తప్పకుండా పాటించాల్సిందేనని తహసీల్దార్ మహమ్మద్‌జియా తెలిపారు. ఎస్ఐ కోటయ్య మాట్లాడుతూ.., శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎలాంటి వారినైనా సహించేది లేదన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా ఎలాంటి హింసాత్మక ఘటనలు జరిగితే.., పోలీస్‌వారికి లేదా రెవెన్యూ అధికారులుగాని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్స్, వీఆర్వోలు, సచివాలయ మహిళా పోలీసులు ఉన్నారు.

చెన్నయ్య హుండీ ఆదాయం రూ.5 లక్షలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. హుండీ ఆదాయం 2 నెలల కాలంలో రూ.5,05,253 వచ్చిందని ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, దేవస్థాన సిబ్బంది, రాజ్యలక్ష్మీ మహిళా భక్తబృందం సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వలంటీర్



టీడీపీలోనికి ఆహ్వానిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

కంభం, మార్చి 28 : కంభం మండలం కందులాపురంలో వలంటీర్‌గా పని చేసిన బోగెం కొండయ్య తన ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. గురువారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి కంభం వచ్చిన సందర్భంగా వలంటీర్ కొండయ్య ఆయన్ను కలిసి టీడీపీలోకి వచ్చారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. అందుకనే వలంటీర్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరినట్లు తెలిపారు. కొండయ్యకు కృష్ణకిశోర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతం శ్రీను, రాజు, గాంధీ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, మార్చి 28 : బీజేపీ నాయకులు స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో ఉన్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని, అలాగే పార్లమెంటు అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలో మూడవసారి మోడి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి అటు రాష్ట్రం, ఇటు కేంద్రం అభివృద్ధి బాటలో సాగాలంటే కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి రామాంజనేయులు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, బిజెవైఎం అధ్యక్షులు సాయిచరణ్, ప్రచార కమిటీ కన్వీనర్ రాచర్ల కాసులు, మేధోకమిటీ సభ్యులు రెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

తప్పిన ప్రమాదం



విరిగిన విద్యుత్ స్తంభం

గిద్దలూరు, మార్చి 28 : రాచర్ల మండలం అనుమలవీడులో టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగి నేలపై పడింది. అదృష్టవశాత్తు ఆసమయంలో ప్రజలు ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సోమిదేవిపల్లి నుంచి రాచర్ల వైపు వెళుతున్న టిప్పర్ ప్రమాదవశాత్తు అనుమలవీడులోని ఆటోస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విరిగి రోడ్డుకు అడ్డంగా నేలపై పడింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు తక్షణమే మరమ్మతు కార్యక్రమాన్ని చేపట్టారు.

మద్యం సీసాల పట్టివేత

పొదిలి, మార్చి 28 : అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తి నుంచి పది మద్యం సీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మాదాలవారిపాలెం గ్రామ సమీపంలో వైభవ్ గార్డెన్ రెస్టారెంట్ వద్ద బండారు బాలమోహన్ అనే వ్యక్తి వద్ద నుంచి ఎనిమిది బీరు సీసాలు, పది ఫుల్ బాటిళ్ల విస్కీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాలమోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. రెస్టారెంట్లు, హోటళ్లలో మద్యం విక్రయించినట్లు తెలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పొదిలి, మార్చి 28 : మద్యం మత్తులో కుటుంబ సభ్యులపై దాడి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈగలపాడు గ్రామానికి చెందిన తాటిగుంట్ల భూలక్ష్మీ ఆమె కుమార్తె ఇంట్లో ఉన్నారు. గురువారం ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన తాటిగుంట్ల ప్రతాప్‌రెడ్డి వీరి ఇంటికి వచ్చాడు. అప్పటికే మద్యం సేవించిన ప్రతాప్‌రెడ్డి పాతగొడవలను దృష్టిలో ఉంచుకొని వీరిపై దాడి చేశాడు. ప్రతాప్‌రెడ్డికి భూలక్ష్మి పిన్ని అవుతుంది. భూలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

డిపోలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పొదిలి, మార్చి 28 : పొదిలి ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పొదిలి డిపో ఉద్యోగుల సంఘం నాయకుడు దివాకర్ డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ ఆవరణలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా ఉద్యోగులకు డ్యూటీచార్ట్‌లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతే కాకుండా గ్యారేజ్‌లో కనీస అవరాలైన మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి విధులకు వచ్చే ఉద్యోగులకు విశ్రాంతి గదులలో ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులకు గుర వుతు న్నారన్నారు. ఉద్యోగులకు లీవ్ పొజిషన్ లేదని, ఎక్స్‌పై డ్రైవర్లను వేరే డిపోలకు పంపించారని వారిని మాతృడిపోకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కండెక్టర్ జాఫర్‌జిలానీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కక్షసాధింపుగా వ్యవహరిస్తు న్నారన్నారు. మార్కాపురం డిపోకు రిలీవింగ్‌కు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దుచేసి జిలానీని పొదిలి డిపో లోనే విధులు కల్పించాలన్నారు. ఈ సమస్యకు ముఖ్య కారణమైన సూపరిండెంట్ ధనలక్ష్మీపై కఠిన చర్యలు తీసుకొని, వెంటనే బదిలీ చేయాలని నినాదాలు చేశారు. డిపోలో సమస్యల పరిష్కారం కోసం రెండవరోజు నిరసన కార్యక్ర మం చేపడతామన్నారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకుపోతే 1వ తేదీ నుండి సామూ హిక నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగుల అధ్యక్షులు ఏ బాజీ, కార్యదర్శి ఓబులేసు, ట్రెజరరీ ఎస్‌కె జిలాని, రీజనల్ నాయకులు వీఐఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

- టీడీపీ వై.పాలెం ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు
- పలు కుటుంబాలు ఆ పార్టీలో చేరిక



హసనాబాద్‌లో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, మార్చి 28: నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ఆదరించాలని ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో గురువారం వైసీపీని వీడి 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గ్రామానికి చెందిన ఎలకపాటి చంచయ్య, ఒంటేరు ఎర్రయ్య ఆధ్వర్యంలో బుస్సా నాగిరెడ్డి, రామకృష్ణా రెడ్డి తదితరులు గూడూరి ఎరిక్షన్ బాబు , కందుల రామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి గూడూరి, కందుల టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపడతారన్నారు. ఈ క్రమంలో తనను ఆదరించి న ఈ ప్రాంతం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గత రెండేళ్లుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించా నని సమస్యలు తెలుసుకు న్నానన్నారు. అన్ని గ్రామాల్లో తనను పెద్దఎత్తున ప్రజలు ఆదరిస్తుండడం హర్షణీయమన్నారు. కూట మి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ విజయానికి ఐక్యంగా తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ భాష, ఇస్మాయిల్,షేక్ మంజూర్ భాష, కే రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అక్కపాలెం కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

30 కుటుంబాల చేరిక

పుల్లలచెరువు : మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మండలంలోని అక్కపాలెం నుంచి పది కుటుంబాలు, మర్రివేముల నుంచి ఇరవై కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గ్రామంలో అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులకు అక్కపాలెం గ్రామం ఎక్కడ వుందో తెలుసా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు అచ్చయ్యనాయుడు, మాజీ ఎంపీపీ మాకం సుందరరావులు టీడీపీ నాయకులు దోరకచర్ల అంజిరెడ్డి టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, మానేపల్లి, కవలకుంట్ల సర్పంచులు రమణారెడ్డి ,వెంకటరెడ్డి, నాయకులు యర్రయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శిలో మద్దిశెట్టిపై టీడీపీ సర్వే

- లోకేష్‌ను కలిసిన రాజేష్
- రెండు నియోజకవర్గాలపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీ దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికతోపాటు కందుకూరు నియోజకవర్గ పార్టీలో నెలకొన్న విభేదాలపై దృష్టి సారించింది. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయని దర్శి నియోజకవర్గానికి గురువారం సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌పై ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. మరోవైపు కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఆపార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌ను పిలిపించి నారా లోకేష్ మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకూ 11 నియోజకవర్గాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించిన విషయం విదితమే. తొలుత జనసేనకు కేటాయించిన దర్శి నియోజకవర్గం బీజేపీతో పొత్తు అనంతరం తిరిగి టీడీపీ ఖాతాలోకి చేరింది. దీంతో ఇప్పటికే అక్కడ టికెట్‌ను ఆశిస్తున్న పలువురు అభ్యర్థుల విషయంలో పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకునేందుకు సర్వే చేసి ఉన్నారు. కొద్దిరోజుల క్రితం మాజీమంత్రి శిద్దా రాఘవ రావు టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీచేసే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఆవైపు దృష్టి సారించారు. అయితే మంగళవారం సీఎం జగన్‌ను శిద్దా కలిసివచ్చిన తర్వాత ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆయన వైసీపీలోనే కొనసాగబోతున్నారు. తదనంతరం మద్దిశెట్టి పేరుపై సర్వే చేయించడం చర్చనీయాంశమైంది. వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న మద్దిశెట్టిని ఆపార్టీ పక్కనపెట్టింది. ఆయన వైపు నుంచి టీడీపీలో చేరే సంకేతాలు వెళ్లినందునే తాజా సర్వే చేపట్టిందని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటికే కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు అసెంబ్లీ స్థానాలకు రెడ్డి సామాజికవర్గం వారిని అభ్యర్థులుగా టీడీపీ ఎంపిక చేసింది. ఎర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాలు దళితులకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఒంగోలు నుంచి కమ్మ సామాజికవర్గానికి చెందిన జనార్దన్ పోటీలో ఉన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంతవరకూ అవకాశం ఇవ్వని కొన్ని సామాజికవర్గాలలో కాపులకు దర్శి నుంచి చాన్స్ ఇస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ఆపార్టీ దృష్టిపెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగానే నిన్నమొన్నటి వరకు శిద్దా విషయంలో ఆలోచించిన అధిష్ఠానం తాజాగా కాపు సామాజికవర్గానికి చెందిన మద్దిశెట్టి పేరును పరిశీలనలోకి తీసుకుని పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తీసుకునేందుకు సర్వే చేసినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొంతకాలంగా నియోజకవర్గంలోని అనుచరులకు అందుబాటులో లేని మద్దిశెట్టి గురువారం అనుచరులతో పాటు, టీడీపీ స్థానిక నాయకుల్లో కొందరితో కూడా మాట్లాడినట్లు తెలిసింది. ఇప్పటికే గరికపాటి వెంకట్, గొట్టిపాటి లక్ష్మి, బాచిన కృష్ణచైతన్య, హర్షిణి రవికుమార్‌ల పేర్లు కూడా ఆపార్టీ పరిశీలనలో ఉన్నాయి. ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మార్కాపురం రానుండగా ఈలోపు దర్శి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

రాజేష్‌తో మాట్లాడిన లోకేష్

కందుకూరు అసెంబ్లీ నుంచి రంగంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఇంటూరి రాజేష్‌తో గురువారం లోకేష్ మాట్లాడారు. సాయంత్రం హైదరాబాద్‌లో లోకేష్‌ను రాజేష్ కలిశారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీలో ఉంటే తాను వ్యతిరేకించడం ఖాయమని, ఆ విషయాన్ని గతంలోనే స్పష్టం చేశానని తేల్చిచెప్పినట్లు తెలిసింది. మీరు మంగళగిరి వచ్చి పనిచేయండి, భవిష్యత్తులో మంచి అవకాశం ఇస్తామని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీని తన అనుచరులు అంగీకరించడం లేదని, వారితో మాట్లాడాలని సమాధానమిచ్చినట్లు సమాచారం. నాగేశ్వరరావుతో కలిసి పనిచేయాలని, మీ అనుచరులతో మాట్లాడుకుని పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడవాలని లోకేష్ సూచించారు. ఏ విషయాన్ని ఒకట్రెండురోజుల్లో తేల్చి చెప్పాలన్న లోకేష్. పార్టీ జెండాలతో ఇద్దరు వ్యక్తులు నియోజకవర్గంలో తిరగడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసినట్లు సమాచారం.

వైభవంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

- శరణుఘోషలతో మారుమోగిన భోగేశ్వర ఆలయం
- కొనసాగుతున్న వెలుగొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దారవీడు, మార్చి 28: హరి హరసుతుడు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. పెద్దారవీడులోని శ్రీ భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించి అయ్యప్ప ఆలయంలో గురువారం వేదోచ్చారణ మధ్య ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించారు. వేదపండితులు వీరవెంకట సత్యనారాయణశర్మ, భరద్వాజలు ఆలయ ప్రధానార్చకులు మేడవరం రాఘవేంద్రశర్మల ఆధ్వర్యంలో మండప దేవతా పూజలు, ప్రాతరౌపాసన, దీక్షా హోమం, గర్తన్యాస, రత్నన్యా, బీజన్యాస, ధాతున్యాసములు, జయాది హోమాలు నిర్వహించారు. ఉదయం 9.38 నిమిషాలకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలు, ప్రాణప్రతిష్ఠ పూర్ణాహు తి చేశారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పదహారు రోజుల పండగ

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జవహర్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో గురువారం 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహించారు. ఇటీవలే స్వామికి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా 16 రోజుల పండుగ పురస్కరించుకొని అర్చకుడు శ్రీదేవీ భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డా. డీవీ.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి, మహిళా సేవా కమిటీ, వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

హంసవాహనంపై శ్రీవారు

కొనకనమిట్ల : మండలంలోని వెలుగొండలో వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహోత్సవాలలో భాగంగా వెంకటేశ్వరస్వామి గువారం రాత్రి హంస వాహనంపై నుండి భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు శ్రీలక్ష్మీ అలవేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామిని హంస వాహనంపై కొలువుదీర్చి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అనంతరం మంత్రోచ్ఛరణలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఛైర్మన్ తిరుపతి రెడ్డి, ఈఓ చెన్నకేశవరెడ్డిలు పర్యవేక్షించారు.



స్వామివారిని దర్శించుకున్న భక్తులు

నేటి నుంచి ఉగ్రనరసింహస్వామి తిరునాళ్ల

త్రిపురాంతకం : మండలంలోని గుట్లఉమ్మడివరంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి తిరునాళ్ల ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి తెలిపింది. 29న గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, సుదర్శన హోమం, లక్ష్మీగణపతి హోమం, 30న స్వామి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన, విష్ణుసహస్రనామ పారాయణం, సామూహిక కల్యాణం నిర్వహించనున్నారు.





పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి, శ్రీలక్ష్మి, అలివేలు మంగా సమేత వెంకటేశ్వరుడు, అయ్యప్పస్వామి


వైసీపీ రంగులతో ఉన్న తొట్లు, యార్డ్ ముఖద్వారం

కోడ్ వర్తించదా..?

డంపింగ్ యార్డ్‌కు వేసిన వైసీపీ రంగులను తొలగించని అధికారులు

పీసీపల్లి, మార్చి 28 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 10రోజులు అవుతున్నా కోడ్ అమలు చేయడంలో అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు ఇంకా అలసత్వం వీడడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఫ్లెక్సీలను తొలగించి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులు డంపింగ్ యార్డ్‌కు వేసిన వైసీపీ రంగులను మాత్రం తొలగించలేదు. వాటిని అలాగే వదిలేశారు. పెదయిర్లపాడులోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌కు గతంలో బులుగు, ఆకుపచ్చ రంగులు వేశారు.అవి వైసీపీ రంగులను పోలి ఉన్నాయి. అధికారులు మాత్రం ఆ రంగులను తొలగించకుండా అలాగే వదిలేశారు. అటువైపుగా వెళ్తున్న ప్రజలు డంపింగ్‌యార్డ్ రంగులను చూసి వీటికి కోడ్ వర్తించదా అని చర్చించుకుంటున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. పూర్తికాని టీటీడీ కల్యాణ మండపం


టీటీడీ కల్యాణ మండపానికి కేటాయించిన స్థలం

- అసంతృప్తిలో డిపాజిట్ దాతలు
- శంకుస్థాపనకు మూడేళ్లు
- నేటికీ విడుదల కాని నిధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దర్శి, మార్చి 28 : దర్శి పట్టణంలోని తూర్పు గంగవరం రోడ్డులో నిర్మించ తలపెట్టిన టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపనకే పరిమితమైంది. రెండేళ్ల కిందట రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన టీటీడీ కల్యాణ మండపానికి అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అట్టహాసంగా భూమిపూజ చేశారు. ఆ తర్వాత నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం అక్కడున్న శిలఫలకం వెక్కిరిస్తోంది. టీటీడీ బోర్డు నిర్మాణానికి రామాలయం మాన్యం భూ మిని ఎకరం కేటాయించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కల్యాణ మండపం నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎంతో పోరాడి రామాలయ మాన్యం భూమిని టీటీడీకి కన్వర్ట్ చేయించారు. నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ.50లక్షలను దాతల సహకారంతో సమకూర్చి డీడీ తీసి టీటీడీ బోర్డుకు కూడా పంపారు. నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులు సమకూర్చినప్పటికీ ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. 19-12-2021 తేదీన కల్యాణ మండపం నిర్మాణానికి వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా మౌలిక వసతులతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తామ ని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవడంతో అలాగే నిలచిపోయింది. డిపాజిట్ విరాళాన్ని అందించిన దాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఇప్పట్లో నిర్మాణం చేపట్టే అవకాశమే లేదు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా చేపట్టిన ఒక్క నిర్మాణం పూర్తి కాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కల్యాణ మండప నిర్మాణాని కోసం వేసిన శిలాఫలకం


గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఆర్సీఎం చర్చిలో వేసిన సన్నివేశం (ఫైల్)

నేడు గుడ్‌ఫ్రైడే

సర్వలోక రక్షణకు సిలువనెక్కిన క్రీస్తు

దొనకొండ, మార్చి 28 : దాదాపు కొన్ని వేల సంవత్సరాల క్రితం క్రీస్తు శరీరధారీగా ఈలోకంలో కన్యక అయిన మరియమ్మ గర్భంలో జన్మించారు. దాదాపు ముప్పై మూడున్నర సంవత్సరాలు జీవించి, ప్రజల దోషాలను తనపై వేసుకొని సిలువపై మరణించారు. ఆయన మరణించిన దినాన్నే గుడ్‌ఫ్రైడేగా పాటిస్తున్నారు. గుడ్‌ఫ్రైడే క్రైస్తవులకు ఆరాధ్యమైన పండుగ, 40 రోజుల పాటు ఉపవాసాలు ఉండి పవిత్ర శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) క్రైస్తవులు మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలతో గడుపుతారు. ఏసు జననం దేవుడిని మానవుని చెంతకు చేర్చితే క్రీస్తు శిలువ మానవుడిని దేవుని చెంతకు చేర్చిందని క్రైస్తవుల ప్రగాఢ నమ్మకం. ఏసు ద్వారా లోకానికి సంతోషం. సమాధానం కల్గింది. శిలువ మరణం మానవునికి రక్షణ కల్పించింది. యావత్ క్రైస్తవ ప్రపంచం గుడ్‌ఫ్రైడేని శుక్రవారం జరుపకోనుంది.

స్వేచ్ఛగా ఓటును వేయండి


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

దొనకొండ, మార్చి 28 : ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ తస్నీరు హరినారాయణ సూచించారు. దొనకొండలోని పలు ప్రాంతాల్లో ఓటు హక్కుపై ప్రజలకు గురువారం అవగాహన కార్యక్రమం కల్పించారు. రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హ క్కు అని, ప్రతి ఒక్కరూ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం పరిసరాల్లో ఎన్నికల నిబంధనలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వీఆర్వో ఐలూరి పిచ్చిరెడ్డి, బీఎల్‌వోలు శిరీష, నాసర్ రెడ్డి, రామునాయక్, రాజేశ్వరీ, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి



దర్శి/ముండ్లమూరు, మార్చి 28 : దర్శి పట్టణానికి చెందిన వాకా అఖిల్‌రెడ్డి(24) గుండెపోటుతో బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కుమారుడైన అఖిల్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్ర యత్నం కోసం హైదరాబాద్ వెళ్లాడు. ప్రతిరోజు సాయంత్రం స్నేహితులతో క లిసి స్విమ్మింగ్‌పూల్‌కు ఈతకు వెళ్లేవాడు. బుధవారం సాయంత్రం అఖిల్‌రెడ్డి ఈతకు వెళ్లగా హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. 108లో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. చేతికందిన కుమారుడి హఠాత్తు మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మద్యం పట్టివేత

దొనకొండ, మార్చి 28 : మద్యంను అక్రమంగా తరలిస్తుండగా ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై సంపత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా దర్శి మండలం చందలూరు గ్రామానికి చెందిన మేకనబోయిన కొండయ్య అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా పది మద్యం సీ సాలను తీసుకెళ్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న ముత్తిరెడ్డి

బీసీల అభ్యున్నతికి టీడీపీ కృషి

వెలిగండ్ల, మార్చి 28 : బీసీల అభ్యున్నతికి టీడీపీ ఎంతగానో కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొస్తుందన్నారు. వైసీపీ రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తామని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. అదేవిధంగా చంద్రన్న బీమాను రూ.10 లక్షలకు పెంచుతామని డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. పెళ్లి కానుక పథకాన్ని పునరుద్ధరించి రూ.లక్ష అందజేస్తారని చెప్పారు. టీడీపీ పథకాలను బీసీలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యతతో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, వెలిగండ్ల ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర్లు, కొండు భాస్కర్ రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, మండల బీసీసెల్ అధ్యక్షుడు పిన్నిక బాలకోటయ్య, మండల రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య ఒంగోలు శ్రీను, గురవయ్య, మౌలాసా, పండు, ఖాజవలీ, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీపై సూచనలు

పామూరు, మార్చి 28 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి పింఛన్‌ల పంపిణీపై ఎంపీడీవో పలు సూచనలు చేశారు. సామాజిక పెన్షన్‌లు పంపిణీ చేసే విషయమై గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ జారీ చేసిన విధివిధానాల ప్రకారం అధీకృత ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో నుంచి పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులు తప్పనిసరిగా పొందాలని ఎంపీడీవో పుల్లారెడ్డి సూచించారు. సచివాలయాలకు మంజూరైన నగదును బ్యాంక్ నుంచి విత్ డ్రా చేసి తీసుకెళ్లే క్రమంలో అధీకృత ధ్రువపత్రం లేకపోతే ఎన్నికల స్క్వాడ్ అధికారులు నగదును సీజ్ చేస్తారని తెలిపారు. పింఛన్ పంపిణీ సమయంలో వలంటీర్లు స్కానర్, మొబైల్ ఫోన్ తప్ప వైసీపీ ప్రచార సామగ్రి ఉండకూడదన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎంపీడీవో సూచించారు.

సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి

కనిగిరి, మార్చి 28 : సోలార్ విద్యుత్ వినియోగం వైపు ప్రోత్సహించాలని ఎలక్ట్రికల్ డీ హరిబాబు అన్నారు. డివిజనల్ కార్యాలయంలో గురువారం విద్యుత్ ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యుత్ ఆదా చేయడం ఎంతో అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీయోజన పథకం ద్వారా సౌర విద్యుత్ పథకం అందుబాటులోకి రానుందన్నారు. ఏపీడీసీఎల్ ద్వారా దిగువ, మధ్యతరగతి నివాస విద్యుత్ వినియోగదారుల ప్రయోజనం కోసం సోలార్ పవర్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. 150 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు కిలోవాట్ నుంచి 2కిలో వాట్ సామర్థ్యంతో కూడిన సోలార్ పవర్ అందుతుందన్నారు. కిలోవాట్‌కు రూ.30వేలు, 2కిలో వాట్‌కు రూ.60వేలు, ఆపైన రూ.78వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. సోలార్ సామగ్రికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు పొందవచ్చన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసే సోలార్ రూట్‌మ్యాప్ ప్యానళ్ల ద్వారా ఇంటి లోపల చల్లగా ఉంటుందన్నారు. కనిగిరి డివిజన్ పరిధిలోని ప్రతి ఏఈలు ప్రతి లైన్‌ఇన్‌స్పెక్టర్ ద్వారా కనీసం ఒక్కొక్కరు 5 సోలార్ కొనెక్షన్‌లకు తగ్గకుండా వినియోగదారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

వేసవిలో ఉపాధి పనులు కల్పించాలి

ముండ్లమూరు, మార్చి 28 : వేసవి కాలంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని దినాలు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని ఉపాధి హామీ పథకం ఏపీడీ సుబ్బారావు అన్నారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కూలీలకు పని చూపించాలన్నారు. ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్తే టెక్నికల్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. షామియానాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎండీవో శంకరరావు, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న నాయకులు

ముండ్లమూరు, మార్చి 28 : మండలంలోని రాజగోపాలరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాల ఉ పాధ్యాయుడు సునాథ్ సంస్మరణ సభ గురువారం ముండ్లమూరులో జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సునా థ్ కుటుంబానికి మండల యూటీఎఫ్ సభ్యులు కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.1.50 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మాజీ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీ శ్రీనివాసరావు, శుద్ధపల్లి ప్రసాదు, వెంకటరెడ్డి, రాజశేఖర్, నాగేశ్వరరావు, కాపూరి దేవరాజు, ప్రధాన కార్యదర్శి గోగుల కోటేశ్వరరావులు ఉన్నారు.

మత్స్యకారుల వలకు చిక్కి మొసలి మృతి


మృతి చెందిన మొసలి

మద్దిపాడు, మార్చి 28 : ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లకమ్మ ప్రాజెక్టులో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుల వలలో మొసలి పడింది. ఒడ్డుకు లాగే సరికి అది మృతి చెందింది. అందిన సమాచారం మేరకు మత్స్యకారులు రిజర్వాయర్‌లో బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లి వల వేశారు. కొద్దిసేపటికి వల బరువుగా ఉండటంతో అనుమానించారు. మరికొందరు జాలర్లను కూడా పిలిచి బయటకు లాగారు. అయితే వలకు ఉన్న హుక్కు మొసలి నోట్లోకి వెళ్లడంతో అది మృతి చెందింది. ఈమేరకు మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీశాఖ అధికారులకు చేరవేశారు.

మాదిగల ద్రోహి జగన్..!

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నాగరాజు
- వైసీపీ పాలనలో దళితులపై దాడులు
- టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర


డాక్టర్ ఉగ్రకు పూలమాలవేసి ఘనంగా సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, మార్చి 28: ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ చేస్తామని మాదిగలను నమ్మించి వంచించిన ద్రోహి జగన్‌రెడ్డి అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం కూటమి సంఘీబావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తన తండ్రి చివరి కోరిక అని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన మాదిగ ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు. వైసీపీ వచ్చాక దళితులపై దాడులు పెచ్చురిల్లాయన్నారు. పైకి మాత్రమే నా ఎస్సీలు అంటూనే లోలోపల ఎస్సీలను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మళ్లీ జగన్‌కు అధికారాన్ని కట్టపెడితే ఇక బడుగు, బలహీన వర్గాల మనుగడ కష్టమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గెలుపుకోసం మాదిగలంతా ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. మాదిగల తలరాతలు మారాలంటే రాష్ట్రంలో టీడీపీ, కనిగిరిలో డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి అత్యధిక మెజార్టీతో మాదిగలు గెలిపించాలని కోరారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులపై దాష్టీకాలు, దాడులు చేస్తూ మారణకాండను సృష్టించారని డాక్టర్ ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు దళితుల పక్షపాతి అని బైబిల్‌తో ప్రచారాలు చేసే జగన్‌కు ఆయన కుటుంబానికి చిన్నచూపుగా ఉంటారని ఆరోపించారు. మాదిగల సంక్షేమ పాలన రావాలంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని కోరారు. వైసీపీ పాలనలో జగన్ ఎస్సీ కార్పొరేషన్‌ను నీరుగార్చి, వారి అనుయాయులకు ముట్టచెప్పి కమీషన్‌లను తాడేపల్లి ప్యాలెస్‌కు మళ్లించారన్నారు. మాదిగలంతా తనను ఆదిరించి గెలిపిస్తే రుణపడి ఉంటానని, అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చే స్తానని డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ ఉగ్రను ఎమ్మార్పీఎస్ నాయకులు పూల దండలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాశం, జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తోరేటి ఆనంద్‌మాదిగ, రావినూతల కొండయ్య, బీజేపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కనిగిరిని అభివృద్ధి చేసే సమర్థుడు ఉగ్ర


కనిగిరిలోని 15వ వార్డు, వంగపాడు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు
పామూరు దేవాలయం వీధిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రేణులు

- సూపర్‌సిక్స్ పథకాలపై శ్రేణుల ఇంటింటి ప్రచారం

కనిగిరి, మార్చి 28 : కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేయగలిగే సమర్థుడైన నాయకుడు డాక్టర్ ఉగ్ర ఒక్కరేనని టీడీపీ పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం సూపర్‌సిక్స్ పథకాలపై, డాక్టర్ ఉగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ఇంటింటి ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కనిగిరి అభివృద్ధి జరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రజల్ని అన్ని విధాలుగా పీడించడమే తప్ప సంక్షేమం లేదన్నారు. పథకాల పేరుతో బటన్ నొక్కి, పేదలపై భారాలు మోపి తొక్కిపెట్టారన్నారు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి దివాళా తీయించారన్నారు. చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో సీఎంగా చేసుకోకపోతే రాష్ట్ర ప్రగతి అధోగతి పాలవుతుందన్నారు. ఇక రాష్ట్రంలో దోపిడీలు పెరిగి సామాన్యుడి జీవనం దుర్భరంగా మారుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పారదర్శకంగా పథకాలు అందిస్తామన్నారు. చంద్రబాబు రూపొందించిన ప్రతి పథకంలోనూ మహిళలకే ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. అదేవిధంగా కనిగిరి ప్రాంతంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పాలన ఉగ్రతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉగ్రను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల చినశ్రీనివాసరెడ్డి, షేక్ షరీఫ్, తిరుపాలు, జానీ, తెలుగుమహిళలు షేక్ వాజిదాబేగం, దొరసాని, తులసి, కే నారాయణమ్మ, స్వప్న, దొరసాని, అమ్ములమ్మ, వెంకటలక్ష్మమ్మ, ధనలక్ష్మీ, గిఫ్ట్ ఆర్టికల్స్ కొండలు, జాని, తిరుపాలు, నరసింహా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగపాడు గ్రామంలో..

మండలంలోని వంగపాడు గ్రామంలో టీడిపి సీనియర్ నాయకులు భేరిపుల్లారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఆర్థిక చేయూత కల్పించే దిశగా చంద్రబాబు అద్భుత పథకాలను రూపొందించారన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం, మూడు సిలిం డర్ల పథకంతో మహిళలకు ఎంతో ప్రయోజ నం చేకూరుతుందన్నారు. కనిగిరి ప్రాంత ప్రజలకు సేవ చేయాలని, అభివృద్ధి చేయాలని అహర్నిశలు తపించే డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, నం బుల వెంకటేశ్వర్లు, కాకర్లసత్యం, వెంకటరామిరెడ్డి, రమణయ్య రూబేను, హనుమంతు, జ య రావు, రాంబాబు, మధు, తాళ్ల శ్రీను, ఇర్లా కిశోర్‌బాబు, కొండయ్య, సురేష్, బాస్, జి నాగిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఉమ్మనపల్లి..

మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మనపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత కనిగిరి ప్రాంత ప్రజలపై ఉందన్నారు. కనిగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే సంక్షేమ సారధి డాక్టర్ ఉగ్రన్నను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు మాజీ మండలపార్టీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, గాయంరామిరెడ్డి, ముర హరి నరసయ్య, తాతపూడి స్టాలిన్(బుజ్జి), దశరథ, శ్రీరాములురెడ్డి, ఉడుముల సుబ్బారెడ్డి, బ్రహ్మంగౌడ్, జట్టబోయిన వెంకటేశ్వర్లు, బుర్రి చినగురవయ్య, ఏనోష్, షేక్ కాశిం, ప్రభయ్య, వీ లక్ష్మయ్య, డీలర్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది చంద్రబాబే

పామూరు : వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలోపెట్టే సమర్థుడు చంద్రబాబు అని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ అన్నారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మెరకు పట్టణంలోని దేవాలయం వీధిలో బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ కూటమికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు హరీష్, నీరుకట్టు నాయబ్‌రసూల్, నరసింహారావు, రాంమూర్తి, కారంశెట్టి వెం కటస్వామి, బండ్ల సురేష్, తెలుగు మహిళలు జగదాబి రమణమ్మ, బేగం పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వార్డు మెంబర్

సైకిలెక్కిన వార్డు సభ్యునితోపాటు మరికొందరు

పామూరు, మార్చి 28 : వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని కనిగిరి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఉగ్ర గెలుపుతో బాగుపడుతుందని, ఆ నమ్మకంతోనే వైసీపీ వీడుతున్నామని వార్డు సభ్యుడు గడ్డి వెంకటనరసయ్య తెలిపారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామ పంచాయతీ 2వ వార్డు మెంబర్ గడ్డి వెంకట నరసయ్య, బోగ్యం వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్రంలోని బాన్సువాడ గ్రామంలో తన ముఖ్య అనుచరులతో టీడీపీ కండువాలను కప్పుకున్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నా రు. సంక్షేమం కోసమే వైసీపీ వీడి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారి రాకను స్వాగతిస్తున్నట్లు గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గట్ల కొండారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

తాళ్లూరు, మార్చి 28 : రానున్న ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కల్గించి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వైవీ రమణయ్య హెచ్చరించారు. మండలంలోని అయ్యలపాలెంలో ఎన్నికల సందర్భంగా ఇరుపార్టీల నేతలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో అన్ని పార్టీలకు చెందిన వ్యక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు బైండోవర్ అయిన వ్యక్తులు పోలీస్ శాఖ సూచనలు తప్పక పాటించాలన్నారు. గత ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘటనల ఆధారంగా ఉన్న వ్యక్తులనే బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పోలీసులు గ్రామాల్లో తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని పార్టీలకు చెందిన వ్యక్తులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇరుపార్టీలకు చెందిన శ్రేణులు, సిబ్బంది పాల్గొన్నారు.





బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి

- రాజకీయ చైతన్యం భావపురి సొంతం
- ప్రథమాంధ్ర మహాసభలకు బీజం ఇక్కడే
- నియోజకవర్గంలో ఇప్పటికి 15 సార్లు ఎన్నికలు
- స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన

బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి రాజకీయ చైతన్యం బాపట్ల సొంతం. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది ఇక్కడే. చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉర్రూతలూగించిన గేయ రచయిత వేములపల్లి శ్రీకృష్ణకు బాపట్ల ఓటర్లు పట్టం కట్టి అసెంబ్లీలో తమ వాణిని వినిపించారు. ఇక్కడి నుంచి కోన ప్రభాకరరావు గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, స్పీకర్‌గా సేవలందించారు. అంతేగాక గవర్నర్ పదవిని కూడా అందుకున్నారు. తండ్రి బాటలో ఆయన తనయుడు కోన రఘుపతి బాపట్లలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రశాంతతకు నెలవుగా.. ఆధ్యాత్మికశోభకు నిలయంగా.. విద్యల కాణాచిగా.. వ్యవసాయంలో ఎన్నో నూతన ఆవిష్కరణలకు వేదికగా.. తీర ప్రాంత భద్రతలో తలమానికంగా నిలిచిన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కొలువైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక తొలిసారి అసెంబ్లీ నియోజక వర్గానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో జిల్లా కేంద్రంలో పట్టు నిలుపుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డుతూ గెలుపుకోసం ప్రయత్నిస్తున్నాయి.

బాపట్ల నియోజకవర్గంలో..

మొత్తం ఓట్లు :	1,89,514
పురుషులు :	92,089
మహిళలు :	97417
ఇతరులు :	8

నియోజకవర్గ ముఖచిత్రం



సం.	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	వేములపల్లి శ్రీకృష్ణ	సీపీఐ	ఎన్.వెంకట్రాజు	కాంగ్రెస్	2379
1955	ఎం.వెంకటరాజు	కాంగ్రెస్	వి.శ్రీకృష్ణ	సీపీఐ	7969
1962	కె.కోటేశ్వరరావు	స్వతంత్ర	ఎం.సత్యవతి	కాంగ్రెస్	1210
1967	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	కె.వెంకటేశ్వరరావు	సీపీఎం	15,227
1972	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	ముప్పలనేని శేషగిరిరావు	స్వతంత్ర	2289
1978	కోనప్రభాకర్‌రావు	కాంగ్రెస్	ముప్పలనేని శేషగిరిరావు	జనతా	189
1983	సి.విజయరామరాజు	టీడీపీ	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	29,432
1985	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	ఎం.వి.ఎస్.రాజు	స్వతంత్ర	18,027
1989	చీరాల గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	పి.అచ్యుతరామరాజు	టీడీపీ	15,583
1994	ముప్పలనేని శేషగిరిరావు	టీడీపీ	కత్తిపద్మారావు	బీఎస్‌పీ	41,494
1999	మంతెనఅనంతవర్మ	టీడీపీ	ముప్పలనేని శేషగిరిరావు	కాంగ్రెస్	13,845
2004	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	మంతెన అనంతవర్మ	టీడీపీ	15,569
2009	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	చీరాల గోవర్ధన్‌రెడ్డి	టీడీపీ	1363
2014	కోన రఘుపతి	వైసీపీ	అన్నం సతీష్‌ప్రభాకర్	టీడీపీ	5813
2019	కోన రఘుపతి	వైసీపీ	అన్నం సతీష్ ప్రభాకర్	టీడీపీ	15,192

బాపట్ల నియోజకవర్గంలో సామాజిక వర్గాల వారీగా ఓటర్ల అంచనా

రెడ్డి	43,000
ఎస్సీ(మాదిగ)	4,000
ఎస్సీ(మాల)	38,000
ముస్లి	13,800
కాపు	15,000
కమ్మ	8,000
యాదవ	19,000
గౌడ	9,000
రజక	4,000
వైశ్య	5,000
ఎస్టీ	10,000
మత్స్యకార	5,000
బ్రాహ్మణ	3,500
క్షత్రియులు	4,000
ఇతరులు	8,214

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆటుపోట్లతో నిండిన సముద్ర తీర ప్రాంత నియోజకవర్గమైన బాపట్ల ప్రజలు ప్రశాంతత మారుపేరుగా నిలిచారు. వివాదాలకు దూరంగా సామరస్యంగా మెలిగే ప్రజలు రాజకీయ చైతన్యం కలిగి ఉంటారు. బాపట్లకు ఎంతో చారిత్రక ప్రసిద్ధి ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నో పోరాటలకు బాపట్ల వేదికగా నిలిచింది. రాజకీయంగా కూడా ఎంతో చైతన్యం కలిగిన ప్రాంతంగా బాపట్ల ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన వెంకటరాజు 1955లో కాంగ్రెస్ తరపున అసెంబ్లీలో అడుగుపెట్టారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పుట్టింది ఇక్కడే.

నియోజకవర్గ ప్రస్థానం.. చరిత్ర

1794లోనే బాపట్ల తాలూకాగా ఏర్పడింది. జిల్లా ఏర్పాటు వరకు బాపట్ల తెనాలి రెవెన్యూ డివిజన్‌లో ఉండేది. 2022లో జిల్లాగా ఏర్పడ్డాక రెవెన్యూ డివిజన్‌గా అవతరించింది. బాపట్ల నియోజకవర్గ పరిధిలో బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు ఉన్నాయి. బాపట్ల మండల పరిధిలో 28 గ్రామాలు ఉండగా, కర్లపాలెం పరిధిలో 20, పిట్టలవానిపాలెం మండల పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. ఇక బాపట్ల ఎన్నో చారిత్రక పోరాటాలకు, ఉద్యమాలకు వేదికగా నిలిచింది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఉద్యమాలలో హరిజనులకు దేవాలయ ప్రవేశం, మంచినీటి బావుల ఏర్పాటు, వితంతు వివాహాలు బాపట్ల నుంచి మంతెన వెంకటరాజు శ్రీకారం చుట్టారు. దీంతో బాపట్ల పేరు బ్రిటీష్ వారి హయాంలోనే జాతీయ స్థాయిలో మారుమోగింది. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది కూడా ఇక్కడే. 1913 మేలో నిర్వహించిన ఈ సమావేశాలకు బాపట్ల టౌన్‌హాలు వేదికగా నిలిచింది. 1916లో హోంరూల్ ఉద్యమంపై బ్రిటీష్ దమన నీతిని వ్యతిరేకిస్తూ భారీ సభ నిర్వహించారు.

వరి, ఆక్వాతో పాటు మత్స్యకారులు..

వ్యవసాయంగా ఈ ప్రాంతం ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడి ఉంది. బాపట్ల మండల పరిధిలో ఎక్కువగా వరి సాగు చేస్తుండగా, కర్లపాలెం మండల పరిధిలో ఆక్వా సాగు ఎక్కువగా జరుగుతుంది. సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో చేపల వేటపై ఆధారపడి బతుకీడ్చే మత్స్యకారుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఆక్వారంగానికి సంబంధించి హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా ఉండడంతో వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రంగంగా ఆక్వా ఉంటోంది. ఏటా వేలకోట్ల టర్నోవర్ ఆక్వా రంగం మీదే ఆధారపడి జరుగుతుంటోంది.

తుఫాన్ల బెడద..

సుదూర సముద్ర తీర ప్రాంతం బాపట్ల పరిధిలో ఉండడంతో ఈ ప్రాంతానికి తుఫాన్ల బెడద ఎక్కువే. ఇప్పటి వరకు ఐదు భారీ తుఫాన్లు బాపట్ల పరిసరాల్లో తీరం దాటినట్లు సమాచారం. తాజాగా మిచౌంగ్ తుఫాన్ బాపట్ల సమీపంలోనే తీరం దాటింది. అందుకే తుఫాన్ సంకేతాలు కనబడిన ప్రతిసారి ఈ ప్రాంత పరిధిలోని రైతులు వణికిపోతుంటారు.

పర్యాటకంగా.. ఆధ్యాత్మికంగా..

బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీకమాసంలో అయితే లక్షల్లో భక్తులు సముద్ర స్నానానికి పోటెత్తుతారు. దీంతో ఆటవిడుపు కేంద్రంగా బాపట్ల ప్రసిద్ధికెక్కింది. తీరంలో ఉన్న సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తీరం అందాలకు మరింత వన్నెలద్దినట్లు ఉంటుంది. వార సత్వ సంపదగా బాపట్ల బావన్నారాయణస్వామి ఆలయం భాసిల్లుతోం ది. భక్తులకు కొంగుబంగారంగా జిల్లెల్లమూడి అమ్మ ఉంది. బాపట్ల పట్టణంలోని సీబీజెడ్ చర్చికి ఘన చరిత్ర ఉంది. వందల ఏళ్ల పైబడి క్రైస్తవులకు ఆరాధన స్థలంగా ఖ్యాతికెక్కింది. దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా స్థాపించిన వేద పాఠశాలగా శ్రీశంకర విద్యాలయం విరాజిల్లుతోంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తొలిగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రా మంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ వేయడం ఆనవాయితీగా వస్తోంది. చందోలు పరిధిలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివస్తుంటారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో గ్రామదేవతల పేరిట తిరునాళ్లు జరగడం ఇక్కడ ప్రత్యేకత.

తొలి వ్యవసాయ కళాశాల..

బాపట్లలో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న వ్యవసాయ కళాశాల 1945లో మొదలైంది. అప్పట్లో ఇది దక్షిణ భారతదేశంలోనే ఏర్పడిన తొలి వ్యవసాయ కళాశాల కావడం గమనార్హం. ఎంతో మంది మట్టిలో మాణిక్యాలను అందించి ప్రపంచ చిత్రపటంలో బాపట్లను నిలపడంలో ఏజీ కళాశాల తనదైన ముద్ర వేసుకుంది. బీపీటీ - 5204 సహా ఎన్నో మేలు రకాల వంగడాలను దేశానికి అందించిన ఘనత ఈ గడ్డ సొంతం. జీడిమామిడి పరిశోధన కేంద్రంతో పాటు ఉప్పునీటి పరిశోధనాకేంద్రం కూడా బాపట్లలో ఉన్నాయి. బాపట్ల ఎడ్యుకేష నల్ సొసైటీ కూడా పేరెన్నిక గల సంస్థగా వెలుగొందుతుంది.

పెద్దల సభకు ఐదుగురు..

శాసనమండలికి బాపట్ల నుంచి ఐదుగురు ప్రాతినిధ్యం వహించారు. 1983 దశకంలో ఎమ్మెల్సీలుగా ముప్పలనేని శేషగిరిరావు, ఆచంట రంగనాయకులు ఎన్నికయ్యారు. మూడు దశబ్దాల తర్వాత అన్నం సతీష్‌ప్రభాకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పెద్దల సభలో అడుగుపెట్టారు. శాసన మండలి చీఫ్‌విప్‌గా ప్రస్తుతం ఉమ్మారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా గడచిన సంవత్సరం ఆగస్టులో ఎన్నికయ్యారు

- 1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఏడు సార్లు కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టగా, నాలుగుసార్లు టీడీపీకి, సీపీఐ, స్వతంత్రులు ఒకసారి, చివరి రెండుసార్లు వైసీపీ విజయం సాధించాయి.
- బాపట్ల ఓటర్ల తీర్పు ప్రతిసారీ ప్రత్యేకమే. 1967నుంచి బాపట్లలో ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ నడిచింది. అయితే అది 2009 వరకు మాత్రమే కొనసాగింది. 2014లో బాపట్లలో వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి ఎమ్మెల్యేగా విజయం సాధించగా టీడీపీ అధికారంలోకి వచ్చింది.
- చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉర్రూతలూగించిన గేయ రచయత వేములపల్లి శ్రీకృష్ణ 1952లో తొలిసారి సీపీఐ తరపున బాపట్ల ఓటర్లు పట్టం కట్టారు.
- 1967, 72, 78లలో హ్యాట్రిక్ విజయాన్ని కాంగ్రెస్ తరపున కోన ప్రభాకరరావు నమోదు చేశారు. ఈయన మంత్రిగా, స్పీకర్‌గా, గవర్నర్‌గా సేవలందించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరపున సీ విజయరామరాజు విజయం సాధించి కోన ప్రభాకరరావు విజయ పరంపరకు బ్రేక్ వేశారు. 2014, 2019లో వైసీపీ తరపున ప్రభాకరరావు తనయుడు కోన రఘుపతి గెలుపొందారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కోన రఘుపతి పనిచేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ తరపున కోనకే అభ్యర్థిత్వం ఖరారవగా హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు.
- 2004, 2009లో కాంగ్రెస్ తరపున విజయం సాధించిన గాదె వెంకటరెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా సేవలందించారు.



వేములపల్లి శ్రీకృష్ణ | ఎం. వెంకటరాజు | కొమ్మినేని వెంకటేశ్వరరావు | కోన ప్రభాకరరావు | సి. విజయరామరాజు | ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు | చీరాల గోవర్ధనరెడ్డి | ముప్పలనేని శేషగిరిరావు | మంతెన అనంతవర్మ | గాదె వెంకటరెడ్డి | కోన రఘుపతి (ప్రస్తుత ఎమ్మెల్యే వైసీపీ తరపున బరిలో వున్న అభ్యర్థి) | వేగేశన నరేంద్ర వర్మ (టీడీపీ తరపున బరిలో ఉన్న అభ్యర్థి)

దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు

- జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా ఆదేశాలు



సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ప్రత్యేకసదుపాయాలు కల్పించే అంశంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధ ఓటర్లు సులభతరంగా ఓటు వేసేలా స్నేహ పూర్వక వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో 14,525 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్ల దాటిన వృద్ధ ఓటర్లు 8,633 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేయాలని, పోలింగ్ కేంద్రాల వారీగా వీల్‌చైర్స్ ఏర్పాటుపై ఆర్‌వోల నుంచి నివేదిక తెప్పించుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధుల కొరకు తప్పనిసరిగా ర్యాంప్‌లు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా వాహనాలు, ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. హోమ్ ఓటింగ్ కోసం సాక్ష్యం యాప్‌లో ముందస్తుగా వృద్ధులు, దివ్యాంగులతో పేర్లు నమోదు చేయించాలన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, నోడల్ అధికారి గుణశీల, డీఈవో నారాయణరావు, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ వకుల్‌జిందాల్

చెక్‌పోస్ట్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. చెక్‌పోస్ట్‌ల్లో విధులు నిర్వహించే సిబ్బందితో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలింపును ఆయా చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అడ్డుకోవాలన్నారు. ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్లరాదని, అవసరమైతే ఆధారాలను చూపాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వాహనాల తనిఖీ సమయంలో చెక్‌పోస్ట్ పోలీసులకు సహకరించాలని తెలిపారు.

బాలాజీ vs వాసుబాబు

- పర్చూరు వైసీపీలో ముసలం
- యడం వ్యాఖ్యలపై నీరుకట్టు మనస్తాపం

చీరాల, మార్చి 28: వైసీపీ పర్చూరు నియోజకవర్గంలో మరో ముసలం మొదలైంది. ఆ పార్టీ అభ్యర్థి యడం బాలాజీ, కారంచేడు మండల ఎంపీపీ నీరుకట్టు వాసుబాబుల మధ్య బంధాలు బలహీనపడ్డాయి. తాజాగా వారి మధ్య విభేదాలు క్లైమాక్స్‌కు చేరాయి. గురువారం చీరాలలోని యడం బాలాజీ కార్యాలయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే చిల్లుపడ్డ పడవలా వైసీపీ పరిస్థితి ఉందని, తాజా పరిణామాలతో మునిగే పడవగా తమ పరిస్థితి మారిందని ఆ పార్టీకి చెందిన పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కారంచేడు మండలం తిమిడిదపాడులో స్థానిక కన్వీనర్‌కు సంబంధం లేకుండా బాలాజీ ఆదేశాల మేరకు యద్దనపూడికి చెందిన మరో నాయకుడితో కార్యక్రమం జరిపించారు. దీంతో స్థానికంగా నాయకత్వం వహిస్తున్న వ్యక్తి ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. తమ గ్రామంలో ప్రస్తుతం కార్యక్రమం నిర్వహించిన వ్యక్తి వచ్చి ఎన్నికచేస్తాడా, లేకుంటే తాము చేయాలో తేల్చుకోవాలని బాలాజీకి అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. విషయం తారస్థాయికి చేరుకుంటున్న తరుణంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు వద్ద దీనిపై మంతనాలు జరిగాయి. ఈక్రమంలో తిమిడిదపాడు నాయకుడు, మరికొందరు అసమ్మతివాదుల పక్షాన వాసుబాబు వకాల్తా పుచ్చుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు చీరాలలోని బాలాజీ కార్యాలయంలో ఆయన్ను కలిసినట్లు సమాచారం. ఈ క్రమంలో చర్చల సమయంలో బాలాజీ ఒక దశలో పార్టీలో ఉంటే ఉండండి, లేకుంటే పోండని అన్నట్లు తెలిసింది. పార్టీలో ఉండనులే వెళ్లిపోతాను అంటూ వాసుబాబు వెలుపలకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో వాసుబాబు, ఇతర అసమ్మతి నాయకులు, వారి అనుచరుల అడుగులు ఎలా ఉంటాయనే అంశంపై వైసీపీతో పాటు, ఇతర రాజకీయపార్టీల్లోనూ చర్చ జరుగుతోంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.48 (శనివారం)

అధికారాలు.. కలేనా!

- పంచాయతీ కార్యదర్శులు సచివాలయాలకే పరిమితం
- జీవో వచ్చి నెల రోజులు దాటినా అమలులోకి రాని వైనం
- ఎన్నికల ప్రచారంలో వాడుకోవడానికేనా సాచివేత
- అస్తవ్యస్తంగా మారిన పంచాయతీల పనితీరు





గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వారు పేరుకే పంచాయతీ కార్యదర్శులు.. కానీ వారి విధులన్నీ సచివాలయాలకే పరిమితం. ఓ వైపు వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. మరోవైపు అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం దక్కలేదు. కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింటున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే ప్రభుత్వం జీవో నెం. 149 విడుదల చేసిన ప్రభుత్వం జీవోను బుట్టదాఖలు చేసింది. తాజాగా ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. ఈసారి కూడా అది అమలుకు నోచుకోలేదు. దీంతో పంచాయతీ వ్యవస్థ ఎప్పుడు గాడిన పడుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది.

నెలరోజుల క్రితమే జీవో..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ సచివాలయాలు వున్నాయి. వాటిలో దాదాపు 700 మందికి పైగా గ్రేడ్ 1,2,3,4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2020లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్ చేసుకుంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా 1268 మందికి పైగా పంచాయతీ కార్యదర్శులున్నా గ్రామ పంచాయతీల పాలన మాత్రం గ్రేడ్ 1, 2, 3, 4 కార్యదర్శులు 700 మంది ఆధ్వర్యంలోనే సాగుతోంది. మిగిలిన పంచాయతీల్లో మాత్రం ఇన్‌చార్జి కార్యదర్శులదే అధికారం. సచివాలయ పరీక్షల ద్వారా నియమితులైన 568 మంది వున్నా ప్రభుత్వం వారికి పంచాయతీల విధులు కేటాయించలేదు. వారిని సచివాలయాలకే పరిమితం చేసి వారిని తమ ఇష్టారాజ్యంగా వాడుకుంది. అయినా ఫలితం మాత్రం దక్కలేదు.

ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి మాటేంటి?

జిల్లాలో వున్న 700 గ్రేడ్- 1,2,3,4 కార్యదర్శులకే పంచాయతీల బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం అందుకోసం రెండు, మూడు పంచాయతీలను కలిపి క్లస్టర్లుగా రూపొందించింది. దానికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులనే ఇన్‌చార్జిగా నియమించింది. దాదాపు ఐదేళ్ల క్రితం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగినా వారికి పంచాయతీలు కేటాయించలేదు. 'ఒక పంచాయతీ-ఒక కార్యదర్శి' అన్న నియమానికి మోక్షం మాత్రం దక్కలేదు. తాజాగా విడుదల చేసిన జీవోఎంఎస్ నెం. 11 ప్రకారం గ్రామ జనబా 500 దాటిన ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, దాని కోసం అదనంగా మరికొన్ని గ్రామ పంచాయతీలకు డీడీవో కోడ్‌ను కొత్తగా రూపొందించాల్సి వుంది. అప్పుడు మాత్రమే పంచాయతీల పాలన గాడిన పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు వున్నా అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూ మంత్రపు చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ ఈరోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. జీవోనే పెద్ద బూటకమని అర్థమై వారు ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వం సరిగ్గా ఎన్నికలకు నెలరోజుల ముందు జీవో జారీ చేసింది. కానీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు.

ఆది నుంచి గందరగోళమే..

సచివాలయ వ్యవస్థ అమలులోకి తెచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులోభాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఇప్పుడు ఆ విధులకు అటంకం ఏర్పడుతుందన్న కారణంగా అప్పాయింటింగ్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉద్యోగులకు అధికారాల కల నెరవేరలేదు. పంచాయతీలకు పట్టిన గ్రహణం వీడలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింటోంది. కాగా పంచాయతీ కార్యదర్శులను అధికార పార్టీ వినియోగించుకోవాలనే కుట్రకోణం దీని వెనక దాగి వుందా అన్న అనుమానం పలువురు వ్యక్తంచేస్తున్నారు.

దర్శిలో మద్దిశెట్టిపై టీడీపీ సర్వే

● లోకేష్‌ను కలిసిన రాజేష్

● రెండు నియోజకవర్గాలపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీ దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికతోపాటు కందుకూరు నియోజకవర్గ పార్టీలో నెలకొన్న విభేదాలపై దృష్టి సారించింది. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయని దర్శి నియోజకవర్గానికి గురువారం సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌పై ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. మరోవైపు కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఆపార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌ను పిలిపించి నారా లోకేష్ మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకూ 11 నియోజకవర్గాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించిన విషయం విదితమే. తొలుత జనసేనకు కేటాయించిన దర్శి నియోజకవర్గం బీజేపీతో పొత్తు అనంతరం తిరిగి టీడీపీ ఖాతాలోకి చేరింది. దీంతో ఇప్పటికే అక్కడ టికెట్‌ను ఆశిస్తున్న పలువురు అభ్యర్థుల విషయంలో పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకునేందుకు సర్వే చేసి ఉన్నారు. కొద్దిరోజుల క్రితం మాజీమంత్రి శిద్దా రాఘవరావు టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీచేసే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఆవైపు దృష్టి సారించారు. అయితే మంగళవారం సీఎం జగన్‌ను శిద్దా కలిసి వచ్చిన తర్వాత ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆయన వైసీపీలోనే కొనసాగబోతున్నారు. తదనంతరం మద్దిశెట్టి పేరుపై సర్వే చేయించడం చర్చనీయాంశమైంది. వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న మద్దిశెట్టిని ఆపార్టీ పక్కనపెట్టింది. ఆయన వైపు నుంచి టీడీపీలో చేరే సంకేతాలు వెళ్లినందునే తాజా సర్వే చేపట్టిందని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటికే కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు అసెంబ్లీ స్థానాలకు రెడ్డి సామాజికవర్గం వారిని అభ్యర్థులుగా టీడీపీ ఎంపిక చేసింది. ఎర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాలు దళితులకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఒంగోలు నుంచి కమ్మ సామాజికవర్గానికి చెందిన జనార్దన్ పోటీలో ఉన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంత వరకూ అవకాశం ఇవ్వని కొన్ని సామాజికవర్గాలలో కాపులకు దర్శి నుంచి చాన్స్ ఇస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ఆపార్టీ దృష్టిపెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగానే నిన్నమొన్నటి వరకు శిద్దా విషయంలో ఆలోచించిన అధిష్ఠానం తాజాగా కాపు సామాజికవర్గానికి చెందిన మద్దిశెట్టి పేరును పరిశీలనలోకి తీసుకుని పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తీసుకునేందుకు సర్వే చేసినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొంతకాలంగా నియోజకవర్గంలోని అనుచరులకు అందుబాటులో లేని మద్దిశెట్టి గురువారం అనుచరులతో పాటు, టీడీపీ స్థానిక నాయకుల్లో కొందరితో కూడా మాట్లాడినట్లు తెలిసింది. ఇప్పటికే గరికపాటి వెంకట్, గొట్టిపాటి లక్ష్మి, బాచిన కృష్ణచైతన్య, హర్షిణి రవికుమార్‌ల పేర్లు కూడా ఆపార్టీ పరిశీలనలో ఉన్నాయి. ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మార్కాపురం రానుండగా ఈలోపు దర్శి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

రాజేష్‌తో మాట్లాడిన లోకేష్

కందుకూరు అసెంబ్లీ నుంచి రంగంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా తానూ పోటీలో ఉంటానని ప్రచారం చేస్తున్న ఇంటూరి రాజేష్‌తో గురువారం లోకేష్ మాట్లాడారు. సాయంత్రం హైదరాబాద్‌లో లోకేష్‌ను రాజేష్ కలిశారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీలో ఉంటే తాను వ్యతిరేకించడం ఖాయమని, ఆవిషయాన్ని గతంలోనే స్పష్టం చేశానని తేల్చిచెప్పినట్లు తెలిసింది. మీరు మంగళగిరి వచ్చి పనిచేయండి, భవిష్యత్తులో మంచి అవకాశం ఇస్తామని లోకేష్ సూచించగా నాగేశ్వరరావు పోటీని తన అనుచరులు అంగీకరించడం లేదని, వారితో మాట్లాడాలని సమాధానమిచ్చినట్లు సమాచారం. నాగేశ్వరరావుతో కలిసి పనిచేయాలని, మీ అనుచరులతో మాట్లాడుకుని పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడవాలని లోకేష్ సూచించారు. ఏ విషయాన్ని ఒక ట్రెండురోజుల్లో తేల్చిచెప్పాలన్న లోకేష్. పార్టీ జెండాలతో ఇద్దరు వ్యక్తులు నియోజకవర్గంలో తిరగడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పోస్టల్ బ్యాలెట్ కోసం 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 28 : పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకునే వారు వచ్చేనెల 22వ తేదీలోపు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. అత్యవసర సర్వీసులో ఉండే 33శాఖల ఉద్యోగులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో గురువారం పోస్టల్ బ్యాలెట్లపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు అత్యవసర సేవలు అందించాల్సిన ఉన్నందున ప్రత్యక్షంగా ఓటు వేసే అవకాశం లేని వారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని చెప్పారు. అందుకోసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ఐదు రోజుల్లోపు (వచ్చేనెల 22లోపు) రిటర్నింగ్ అధికారికి ఫారం-12(డి) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ దిశగా శాఖల వారీగా వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో ఆర్.శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైలును చూస్తున్న ప్రజలు

దర్శికి వచ్చిన ప్యాసింజర్ రైలు

దర్శి, మార్చి 28 : ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న దర్శి ప్రాంత వాసుల కల త్వరలోనే నెరవేరనుంది. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం దాదాపు పూర్తయింది. తొలిదశలో నడికుడి నుంచి దర్శి వరకు ఏప్రిల్ నుంచి రైళ్లు నడపాలని అధికారులు నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం ప్యాసింజర్ రైలు తొలిసారిగా దర్శికి వచ్చింది. రైల్వే లైన్ ట్రయిల్ చూసుకునేందుకు అధికారులు రైలును దర్శికి నడిపించారు. ఇప్పటికే దర్శిలో రైల్వేస్టేషన్ నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కొద్ది రోజుల క్రితం వచ్చిన గూడ్స్ రైలును ప్రజలు చూసేందుకు వెళ్లగా, తాజాగా ప్యాసింజర్ రైలును చూసేందుకు పెద్దఎత్తున వెళ్లారు.



వలలో చిక్కి మృతి చెందిన మొసలి

మత్స్యకారుల వలకు చిక్కి మొసలి మృతి

మద్దిపాడు, మార్చి 28 : ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లకమ్మ ప్రాజెక్టులో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుల వలలో మొసలి పడింది. ఒడ్డుకు లాగేసరికి అది మృతి చెం దింది. అందిన సమాచారం మేరకు మత్స్యకారు లు రిజర్వాయర్‌లో బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లి వల వేశారు. కొద్దిసేపటికి వల బరువుగా ఉండటంతో అనుమానించారు. మరికొందరు జాలర్లను కూడా పిలిచి బయటకు లాగారు. అయితే వలకు ఉన్న హుక్కు మొసలి నోట్లోకి వెళ్లడంతో అది మృతి చెందింది. ఈమేరకు మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీ శాఖ అధికారులకు చేరవేశారు.

విచ్చలవిడిగా ఎన్నికల తాయిలాలు

షెడ్యూల్‌కు ముందే ప్రారంభం

అనంతరం జోరందుకున్న వైనం

పట్టించుకోని అధికారులు

సీ విజిల్‌కు ఫిర్యాదుతో కదలిక

గుత్తికొండవారిపాలెం వద్ద

భారీగా చీరలు స్వాధీనం

కేసు నమోదులో జాప్యం

అలా వదిలేస్తున్నారు!

ఒంగోలులో వైసీపీ నేతల బరితెగింపు

ఎన్నికల నోటిఫికేషన్ ముందే వైసీపీ ప్రలోభాల జాతర ప్రారంభించింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తోంది. ఒంగోలులో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. షెడ్యూల్ ప్రకటనకు ముందే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై నజరానాల వల విసిరిన అధికార పార్టీ నేతలు ఇప్పుడు ఓటర్లకు గాలం వేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా చీరలు, ఇతరత్రా తాయిలాల పంపిణీ ప్రారంభించారు. అయితే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు సీ విజిల్‌ను అస్త్రంగా చేసుకున్నారు. నగర పరిధిలోని గుత్తికొండవారిపాలెంలోని ఓ గోదాములో భారీగా చీరలు నిల్వ ఉన్న విషయమై బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆగమేఘాలపై స్పందించి రూ. 20లక్షల విలువైన తాయిలాలను అధికారులు సీజ్ చేశారు. అయితే కేసు నమోదు విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేరోజు అర్ధరాత్రి నగరంలో వైసీపీ రంగులతో ఉన్న తోపుడు బండ్లను ఆపార్టీ నేతలు పంపిణీ చేస్తుండగా సీవిజిల్‌కు సమాచారం అందడంతో 14 బండ్లను స్వాధీనం చేసుకున్నారు. కానీ చర్యలు కరువయ్యాయి.

ఒంగోలు (క్రైం), మార్చి 28 : వైసీపీ ప్రభుత్వం సాగించిన ఐదేళ్ల ప్రజాకంటక పాలనతో సీఎం జగన్‌రెడ్డి, ఆపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్రప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు. అందినకాడికి దోచుకొని పాలనలో మాత్రం ఉత్సవ విగ్రహాలుగా ఉంటూ కాలం వెళ్లదీశారు. ప్రజాప్రతినిధులుగా ఉండి జనానికి చేసిన మేలును వివరించి ఓట్లు అభ్యర్థించలేని పరిస్థితి వారికి దాపురించింది. దీంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. సామ,దాన,భేద దండోపాయలను ప్రయోగిస్తోంది. షెడ్యూల్‌కు ముందే ప్రలోభాల పర్వానికి తెరతీసిన వారు ఇప్పుడు దాన్ని ముమ్మరం చేశారు. ఒంగోలు నగరంలో ఈ వ్యవహారం మరింత జోరుగా సాగుతోంది.

కోడ్ వచ్చిన రోజే సచివాలయ సెక్రటరీలకు తాయిలాలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ఈనెల 16న విడుదల చేసింది. ఆరోజు నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే ఆదేరోజు నగర మేయర్ గంగాడ సుజాత నగరంలోని సచివాలయ కార్యదర్శులకు ఇంటికి పిలిపించుకొని చీరలు, ప్యాంటు, షర్ట్‌ను పంపిణీ చేశారు. ఇది వివాదాస్పదమైంది. అలాగే దానికి కొద్దిరోజుల ముందు వైసీపీకి చెందిన ముఖ్య నేత నివాసంలో ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బందికి తాయిలాలు ఇచ్చారు. అలాగే వలంటీర్లకు సైతం ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. ఎక్కడికక్కడ వారికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదును అందజేశారు. ఇలాగే ఇళ్ల పట్టణాల పంపిణీ పేరుతో డివిజన్‌లలో కార్యక్రమాలు ఏర్పాటు చేసి భరోసా పత్రంతోపాటు చీర, ప్యాంటు, షర్టు అందజేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారాన్ని మరింత ముమ్మరం చేశారు.

పొగాకు గోదాంలో భారీగా చీరల నిల్వ

ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఒంగోలు మండలం గుత్తికొండవారిపాలెంలో అనాథరైజ్‌డ్ పొగాకు గోదాంలో వైసీపీ నేతలు భారీగా చీరాలను నిల్వ చేశారు. ఈ విషయమై సీ విజిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో బుధవారం అధికారులు దాడి చేశారు. అక్కడ 18 పెట్టెలలో 2,268 చీరలు, 500 సంచులు కనిపించాయి. చీరలు ఉన్న బాక్స్ మీద ధర ప్రకారం ఒక్కో చీర రూ.2,268 కాగా మొత్తం 864 చీరలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ 19,59,552, ఐదు వందల సంచులతో కలిపి సుమారుగా రూ.20లక్షలు విలువ ఉంటుందని వారు అంచనా వేశారు. ఈ చీరలు గుజరాత్‌లోని సూరత్ నుంచి తెప్పించిట్లు తేల్చారు. ఒంగోలు నగరపరిధిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సమయంలోనే కంటైనర్లలో భారీ ఎత్తున చీరలు తెప్పించి భారీగా నిల్వ ఉంచారని తెలుస్తోంది. మొత్తం లబ్ధిదారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలకు పంపిణీ చేయగా మిగిలిపోయినవి అక్కడ ఉంచినట్లు గోదాం యజమాని చెప్పారు.

చర్యలకు అధికారుల వెనకడుగు

పెద్దఎత్తున చీరలు సీజ్ చేసిన అధికారులు తదుపరి చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. దీనిపై గురువారం సాయంత్రం వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఆదేసమయంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం అది పూర్తిగా ఎన్నికలకు సంబంధించిన సామగ్రిగా గుర్తించామని చెబుతున్నారు. అసలు బిల్లులు లేని సరుకు అక్కడ ఎందుకు నిల్వ ఉంచారు అనే అంశం జోలికి వెళ్లలేదు. చీరలు ఉన్న బేళ్ల మీద మంజునాథ గ్రానైట్ మినరల్స్, శంఖవరం అనే చిరునామా ఉంది. గ్రానైట్ కంపెనీలకు అంత పెద్దమొత్తంలో చీరల అవసరం ఏంటన్నది ప్రశార్థకంగా మారింది. ఇది వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అంశం. అయితే ఎన్నికలకు సంబంధించిందని ముడిపెట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా చీరలు పట్టుబడిన గోదాము వద్దకు ఒంగోలు ఆర్డీవో, తహసీల్దార్ వచ్చి పరిశీలించారు. కానీ అక్కడ నిల్వ ఉంచి చీరలు ఎవరికి సంబంధించినవి అన్నది మాత్రం తేల్చాలేదు. గోదాం యజమాని పమ్మి జయరామిరెడ్డి కుమారుడు వినయ్‌కుమార్‌రెడ్డి మాత్రం కొత్తపట్నం మండల వైసీపీ నేత అంజిరెడ్డి చీరలు తెప్పించి నిల్వ ఉంచారని, వాటిని తీసుకెళ్లాలని ఎన్నిమార్లు ఫోన్‌చేసినా స్పందించలేదని విలేకరులకు చెప్పారు. అధికారులు గోదాం యజమానిని విచారిస్తే అక్కడ చీరలు ఎవరు నిల్వ ఉంచారన్నది తెలుస్తుంది. కానీ ఆవైపు దృష్టి సారించలేదు. అయితే చీరలు తమవి అని ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో పౌరసరఫరాల గోదాంకు తరలించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్కడ నిల్వ ఉంచిన చీరల పెట్టెలు, సంచులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలు ఉండటమే అధికారులు తర్జనభర్జనకు కారణంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓ గోదాములో బుధవారం రాత్రి పట్టుబడిన చీరల నిల్వలు

అర్ధరాత్రి తోపుడు బండ్ల పంపిణీ

వైసీపీ నేతలు చిరువ్యాపారులను ఆకర్షించేందుకు తోపుడు బండ్ల పంపిణీని కూడా ప్రారంభించారు. నగరంలో బుధవారం రాత్రి ఈప్రక్రియను చేపట్టారు. రాంనగర్‌లో వీటిని పంపిణీ చేస్తుండగా సీ విజిల్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఆగమేఘాలపై అధికారులు అక్కడికి చేరుకున్నారు. 14 తోపుడు బండ్లను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ వైసీపీ రంగుతో ఉండటం గమనార్హం. కోడ్ అమల్లోకి వచ్చినా ఇలా వైసీపీ నేతలు విచ్చలవిడిగా ప్రలోభాలు కొనసాగించడం బారి బరితెగింపును తెలియజేస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వెనకడుగు వేయడం విమర్శలకు తావిస్తోంది.

మార్చిలోనే మంటలు

పలు ప్రాంతాల్లో

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

పీసీపల్లిలో గరిష్ఠంగా

41.62 నమోదు

ఒంగోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. మార్చి ముగియకముందే మంటలు మొదలయ్యాయి. ఉదయం 10 గంటలకే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో తొలిసారి గురువారం పలు చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40నుంచి 41 డిగ్రీలపైన నమోదయ్యాయి. అత్యధికంగా మండల కేంద్రమైన పీసీపల్లిలో 41.62 డిగ్రీల ఎండ కాచింది. జిల్లాలో వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. అయితే ఏప్రిల్ ఆఖరు నుంచి ఆప్రభావం కనిపిస్తుంది, మేలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అలాంటిది ఈ ఏడాది దాదాపు నెల ముందుగానే ఎండలు మండిపోతున్నాయి. పక్షం రోజుల క్రితం వకూ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యధిక ప్రాంతాల్లో 35నుంచి 38 డిగ్రీల వరకు ఉండగా గురువారం ఒక్కసారిగా పెరిగాయి. ఉదయం 10 గంటల నుంచే చాలా చోట్ల ఎండల తీవ్రత కనిపించగా 12 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అధికంగా ఉంది. ఈ సమయంలో గరిష్ఠంగా పీసీపల్లిలో 41.62 డిగ్రీలు నమోదు కాగా బేస్తవారపేట, తర్లుపాడు, రాచర్ల, మార్కాపురం, దొనకొండ, సీఎస్‌పురం, కనిగిరి, గిద్దలూరు, కురిచేడు, అర్ధవీడు, మద్దిపాడు, చీమకుర్తి, పెద్దారవీడు, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, ముండ్లమూరు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ 39నుంచి 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈఏడాది అత్యధిక ప్రాంతాల్లో సాధారణ వర్షాలు కూడా కురవలేదు. ఆ ప్రభావం ప్రస్తుతం ఎండల సమయంలో కనిపిస్తున్నది. ఇప్పుడే ఎండల తీవ్రత ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కాగా 40 డిగ్రీల కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు ఇలా ఉన్నాయి. పీసీపల్లి 41.62 డిగ్రీలు, మేకలవారిపల్లి 40.74, అనుమలవీడు 40.74, మోక్షగుండం 40.72, దరిమడుగు 40.55, జువ్విగుంట 40.20, గుండ్లాపల్లి 40.13, వెలిగండ్ల 40.4, గిద్దలూరు 40.02 డిగ్రీలు.



పీసీపల్లిలో మధ్యాహ్న సమయంలో నిర్మానుష్య వాతావరణం



మధ్యాహ్న స మయంలో దొనకొండ ప్రధాన రహదారి

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

క్షేత్రస్థాయిలో

సమన్వయానికి కమిటీలు

వచ్చే నెలలో పార్లమెంట్,

అసెంబ్లీ స్థాయి సమావేశాలు

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల

భేటీలో నిర్ణయం

నేడు తెలుగుదేశం పార్టీ

ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో జిల్లాలోని పార్లమెంట్, అన్ని అసెంబ్లీ స్థానాల్లో కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంతో పనిచేయాలని ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలు తీర్మానించాయి. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా బరిలోకి దిగుతున్న విషయం విదితమే. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ప్రకటన కొలిక్కివచ్చిన నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మూడు పార్టీలు మరింత సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఇందు కోసం వచ్చేనెల 4న పార్లమెంట్, 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఐక్య సమావేశాలు నిర్వహించాలని తీర్మానించుకున్నాయి. ప్రధానంగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ అరాచక, అవినీతి పాలనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలు నిర్ణయించారు. మూడు పార్టీల తరఫున ఉమ్మడి కమిటీలు వేసి కార్యాచరణ అమలుకు జిల్లా కమిటీలను ఆదేశించారు. ఈనేపథ్యంలో గురువారం ఒంగోలులో మూడు పార్టీల నేతల తొలివిడత భేటీ అయ్యారు. స్థానిక బీజేపీ ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన ఆ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.వి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీల సంయుక్త కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రాథమికంగా చర్చించారు. నియోజకవర్గస్థాయిలో మరింత సమన్వయంతో సాగడం అవసరమని గుర్తించారు. అందుకోసం కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరోసారి మూడు పార్టీల ముఖ్యనేతలు జిల్లా స్థాయిలో సమావేశమై పూర్తిస్థాయి కార్యచరణ రూపొందించాలని తీర్మానించుకున్నారు.



కూటమి భేటీలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆపార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఏటా ఈ వేడుకలను సాధారణంగా నిర్వహించి జనవరిలో ఎన్‌టీఆర్ వర్ధంతి, మేలో మహానాడు కార్యక్రమాలను భారీగా చేస్తారు. ఈసారి ఎన్నికల ప్రక్రియలో భాగంగా పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం రావడంతో పెద్దఎత్తున నిర్వహించాలని అధిష్ఠానం సూచించింది. తదనుగుణంగా జిల్లాలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు ఇతర రూపాలలో కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

వనజాక్షి హత్యకేసులో భర్తే నిందితుడు

అనుమానంతోనే

హతమార్చాడు : సీఐ

కందుకూరు, మార్చి 28: పట్టణంలో ఈనెల 25న హత్యకు గురైన బ్యూటీషియన్ వనజాక్షిని ఆమె భర్త చిమట శివకృష్ణే హతమార్చాడని పోలీసులు తెలిపారు. గురువారం సాయంత్రం కందుకూరు డీఎస్పీ కార్యాలయంలో సీఐ నఫీజ్‌బాషా, పట్టణ ఎస్ఐ ఆనంద్‌భాస్కర్‌లు విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. వనజాక్షిపై అనుమానంతో భర్త శివకృష్ణ ఆమెను దారుణంగా కొట్టి చంపేశాడని తెలిపారు. వలేటివారిపాలెం మండలం పోకూరుకి చెందిన చిమట శివకృష్ణకు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం గట్లపాడుకి చెందిన వనజాక్షితో పదేళ్లక్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. కందుకూరులో నివాసం ఉంటూ శివకృష్ణ ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే వనజాక్షి బ్యూటీషియన్ వర్క్ నేర్చుకుని నాలుగేళ్లుగా కేసరిగుంట కాలనీలో బ్యూటీపార్లర్ నడుపుతోంది. వనజాక్షిపై అనుమానంతో వారిద్దరిమధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 25న కూడా వారిమధ్య ఘర్షణ జరగ్గా కందుకూరులోనే గుణ్ణంకట్ల ప్రాంతంలో నివాసం ఉంటున్న వనజాక్షి తల్లిదండ్రులు వచ్చి సర్దిచెప్పి వెళ్లారు. అయితే వారు వెళ్లాక కూడా ఇద్దరి మధ్య తిరిగి వివాదం జరగ్గా ఆమెను చంపేయాలన్న ఆలోచనకు వచ్చి ఉన్న శివకృష్ణ ట్రాక్టరు ట్రక్కుకు ఉండే ఇనుప దిమ్మె (పోస్టు)తో ఆమె తల, చేతులపై కొట్టడంతో వనజాక్షి అక్కడికక్కడే మృతి చెందిందని వివరించారు. భార్యను చంపేసి శివకృష్ణ పరారు కాగా, సాయంత్రం కుమార్తె ఎలా ఉందోనని ఫోన్‌చేసిన తల్లిదండ్రులు ఎంతకూ ఫోన్ తీయకపోవటంతో ఇంటికి వచ్చి చూడగా శవమై కనిపించింది. దీంతో వనజాక్షి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి శివకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని పోలీసులు వివరించారు. దీంతో అతన్ని అరెస్టు చేశామన్నారు.



నిందితుడితో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నఫీజ్‌బాషా, ఎస్ఐ ఆనంద్‌భాస్కర్

ఇక్కడే ఇంటర్ మార్కుల స్కానింగ్

● ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు

ఒంగోలు (విద్య), మార్చి 28 : పని వికేంద్రీకరణలో భాగంగా ఇంటర్ మార్కుల స్కానింగ్‌కు ఈఏడాది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఆయా మూల్యాంకన కేంద్రాల వద్దే ఏర్పాట్లు చేశారు. వచ్చేనెల 4వతేదీతో ఇంటర్మీడియేట్ జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికానుంది. అనంతరం మూల్యాంకన కేంద్రాల్లోనే మిషన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల మార్కులను స్కాన్ చేస్తారు. త్వరితగతిన మార్కుల స్కానింగ్ ప్రక్రియ పూర్తవుతున్నందున ఏప్రిల్ 12 తర్వాత ఒకట్రెండ్రోజుల్లో ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్మీడియేట్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. పార్ట్1 వేరు చేసి ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి తాళం వేస్తారు. గతంలో ఓఎంఆర్ షీట్ పార్ట్-3 విద్యార్థుల మార్కుల వివరాలను వేరుచేసి ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయానికి పంపితే మార్కులను అక్కడ స్కాన్ చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ విధానాన్ని మార్చి ఇక్కడే స్కాన్ చేస్తున్నారు. స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలోని మూల్యాంకన కేంద్రంలోనే ఈ ప్రక్రియ మొత్తం జరుగుతుంది.

ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

సింగరాయకొండ, మార్చి 28 : ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మూలగుంటపాడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్ సజావుగా జరిగేటట్లు చూడాలని చెప్పారు. అనంతరం ఉలవపాడు, సింగరాయకొండ మధ్య ఉన్న జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును కలెక్టర్ పరిశీలించారు. తనిఖీ వివరాలను నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవానీశంకర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థిని

సింగరాయకొండ, మార్చి 28 : జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు పాకల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.సిపోరా ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన 49వ రాష్ట్ర అంతర జిల్లాల సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈ నెలాఖరు నుంచి బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించనున్న జా తీయ స్థాయి పోటీల్లో సిపోరా పాల్గొంటుందన్నారు.ప్రతిభ చూపిన విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు పి. హజరత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» పార్టీలో చేరిన యువకులు

మార్టూరు, మార్చి 28: రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యపడుతుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం సాయంత్రం మార్టూరులోని తూర్పుబజారున ఉన్న వినాయక స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్టు చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తూర్పుబజారుకు చెందిన వైసీపీకి చెందిన సీనియర్ నేత కొనకంచి మురళి తన అనుచరులతో ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరినవారిలో రొంపిచర్ల గోపు వెంకట్రావు, సత్తెనపల్లి పరశురాం, తానికొండ గంగయ్య, కొల్లా బ్రహ్మం, తొండెపు శ్రీను, కొనకంచి సాంబయ్య , పొట్రు శ్రీను ఉన్నారు. అలాగే, విజయనగర్ కాలనీకి చెందిన కొమెర వెంకట్రావు, కొమ్మెర అంకమ్మ రావు, కొమ్మెర ప్రభాస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి భుజంగరావు, జంపని సాంబశివరావు, శానంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో తెలుగుతమ్ముళ్ల ప్రచారం



పర్చూరులో ఎన్నికల ప్రచారంలో తెలుగు తమ్ముళ్ళు

పర్చూరు, మార్చి 28: పర్చూరులో తెలుగుదేశం పార్టీ గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. పర్చూరు గ్రామ దేవత శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ప్రారంభించారు. తొలిరోజే పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ శ్రేణులు తరలిరావటంతో పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. ఇంటింట తిరిగి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి సుబ్బారావు, మామిడిపాక హరిప్రసాద్, తంగెళ్ళ మల్లికార్జునరావు, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, ఆకుల మధుబాబు, దూళిపల్లి వెంకటస్వామి, గడ్డిపాటి శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, మక్కెన శేఖర్‌బాబు, లక్కిపోగు సుమన్, చెరుకూరి శ్రీధర్ (చింపయ్య), శ్రీరాం వెంకటసుబ్బారావు, ఊటుకూరి నిర్మల, తులసి కోటేశ్వరమ్మ, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమాదేవి, పఠాన్ బాజీ, షేక్ బషీర్, కట్టెంపూడి జీవన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన తూర్పు బజారు, విజయనగర్ కాలనీ యువకులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పర్చూరు, మార్చి 28: అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కారంచేడు నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులంతా కలసికట్టుగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి అప్పులపాలు చేశారని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ కోసం మాత్రమేనన్నారు. దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలనే లక్ష్యంతో మూడు పార్టీలు జత కట్టాయని వివరించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



గుండ్లకమ్మ నదిలో జరుగుతన్న ఇసుక తవ్వకాలు(ఫైల్)

ఇసుక సమస్య మళ్లీ మొదటికి..

» నిలిచిన రవాణా

» ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత పెరిగిన మైనింగ్ అధికారుల తనిఖీలు

» ఇప్పటివరకు అంతా అనధికారమేనా!

» వైసీపీ నేతల జేబులలోకి వెళ్లాయేమోనన్న అనుమానాలు

అద్దంకి, మార్చి 28: ఎన్నిక కోడ్ వచ్చిన తరువాత అద్దంకి ప్రాంతంలో ఇసుక రవాణాపై మైనింగ్ అధికారుల తనిఖీలు పెరిగాయి. దీంతో ఇసుక రవాణా పూర్తిగా నిలిచింది. దీనినిబట్టి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరిగాయన్న అనుమానాలకు మరింత బలం చేకూరింది. గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్‌ను అధికారికంగా గుర్తించలేదని గతంలో మైనిగ్ అధికారులు ప్రకటించారు. అయితే, క్షేత్రస్థాయిలో ఇసుక తవ్వకాలు అడ్డుకున్న దాఖలాలు లేవు. దీనివెనుక రాష్ట్ర స్థాయిలో సీనరేజ్ దక్కించుకున్న సంస్థకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో పాటు స్థానిక అధికార పార్టీ నేతలకు వాటాలు అందటమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈనేపథ్యంలో ఎన్నికల కోడ్ రావటంతో మైనింగ్ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. దీంతో అనధికారికంగా సీనరేజ్ వసూలు చేసిన వ్యక్తులు జారుకున్నట్లు సమాచారం. మైనింగ్ అధికారులతో పాటు ఎస్ఈబీ అధికారులు కూడా తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో అవకాశం దొరికినప్పుడల్లా ఎస్ఈబీ అధికారులు తనిఖీల పేరుతో వసూళ్లకు తెర లేపినట్టు విమర్శలు వస్తున్నాయి. మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇటీవల ఇసుక దందా జోరుగా సాగగా, ప్రస్తుతం అక్కడ కూడా ఇసుక రవాణా నిలిపివేశారు. దీంతో ఇసుక అక్రమ రవాణాదారులకు నోట్లో ఎలక్కాయ పడినట్లయింది. అయితే, ఇసుక రవాణా నిలిచిపోవటంతో భవననిర్మాణ దారులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు



గుంటుపల్లిలో జరిగిన పోలీసు కవాతులో పాల్గొన్న సీఐ నరసింహారావు

బల్లికురవ, మార్చి 28: సార్వత్రిక ఎన్నికలలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. గురువారం మండలంలోని గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాలలో ప్రత్యేక బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా కొన్ని నిబంధనలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే హింసాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెంచామన్నారు. గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపట్టినా, జూదం నిర్వహించినా, కొత్త వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసు శాఖకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే, గతంలో ఘర్షణలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రౌడీషీటర్లు కదలికలపై నిఘా ఉందని, ఎవరైన చట్టాన్ని ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అద్దంకిలో తనిఖీలు ముమ్మరం



అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

అద్దంకి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు పంపిణీ అరికట్టేందుకు చేపట్టిన తనిఖీలు ముమ్మరం చేశారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బృందం రామ్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేపట్టారు. దీంతో ఇతర అవసరాల కోసం నగదు తీసుకెళ్లే వ్యక్తులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఓటింగ్‌కు సుమారు 45 రోజులు సమయం ఉండటంతో ఇన్ని రోజుల పాటు నగదు లావాదేవీలు జరగకుండా ఎలా అని పలువురు వ్యాపారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

పర్చూరు, మార్చి 28: ఎన్నికల నిర్వహణలో బ్యాంక్ అధికారులు సహకారం అందించాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి గంధం రవీందర్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 40 వరకు బ్యాంకులు ఉన్నాయని, సిబ్బందికి ఎన్నికల డ్యూటీలు వస్తాయన్నారు. మైక్రో అబ్జర్వర్‌కు ఇచ్చే చెక్‌లిస్ట్‌పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, బ్యాంకు లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో పరిశీలన చేస్తారని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్యశ్రీ, మెహర్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి జవసత్వాలు

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలన్న లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కొటికలపూడి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం, విప్పర్లవారిపాలెం, నాగులపాడు, జార్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, బొమ్మనంపాడు, ఉప్పలపాడు, గోవాడ తదితర గ్రామాల నేతలతో గురువారం పంగులూరు మండలం ముప్పవరం వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గుండ్లకమ్మ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పేదవాడి కడుపు నింపే అన్నా క్యాంటీన్‌లు తెరిపిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. టీడీపీ చేపట్టిన ప్రజాగళంతో వైసీపీ బంగాళాఖాతంలో కలిసి పోవటం ఖాయమన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, జొన్నలగొడ్డ గోపి, నర్రా వీరయ్య, గాలం శ్రీనావాసరావు, పూనాటి విక్రమ్, కంచర్ల వెంకటరావు, జ్యోతి రామారావు, మోటుపల్లి నాగేశ్వరరావు, దివికోలు రాధాకృష్ణమూర్తి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన గుడిపూడి బ్రహ్మయ్య, తదితరులు

టీడీపీలో కొంగపాడు సర్పంచ్ వర్గీయుల చేరిక

అద్దంకి, మార్చి 28: మండలంలోని కొంగపాడు సర్పంచ్ గుడిపూడి రమాదేవి బ్రహ్మయ్యతో పాటు పలువురు గురువారం ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. సర్పంచ్ భర్త బ్రహ్మయ్య, కరి సుబ్బారావు, నర్రా వెంకటేశ్వర్లు, అనపర్తి సుబ్బారావు, మాచవరపు శ్రీనివాసరావుతో పాటు పలువురు టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీకి గ్రామలో మరింత మెజార్టీ వచ్చే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా రవికుమార్ కు తెలిపారు.

చెక్‌పోస్టు డ్యూటీకి బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి అటాచ్

» వరుస ఫిర్యాదులు రావటంతో ఎస్పీ ఆదేశాలు



నాగశివారెడ్డి (ఫైల్)

బల్లికురవ, మార్చి 28: గత పది రోజుల నుంచి పలురకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డిని ఎట్టకేలకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పర్చూరు సమీపంలోని అన్నంబొట్లవారిపాలెం ఎన్నికల తనిఖీ చెక్ పోస్టుకు అటాచ్ చేశారు. గురువారం ఎస్ఐ నాగశివారెడ్డి బల్లికురవ స్టేషన్ విధుల నుంచి తప్పుకొన్నారు. స్టేషన్ ఫోను సిమ్ కార్డును రైటర్‌కు అందించారు. బల్లికురవ గ్రామానికి చెందిన వృద్ధుడు శానంపూడి హనుమంతరావుపై ఎస్ఐ దాడి చేయటంతో పాటు ఆయనపై అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. దీనిపై వృద్ధుడు ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. అలాగే, స్టేషన్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కొమ్మినేనివారిపాలెంకు చెందిన వైసీపీ నేతతో ఎస్ఐ నాగశివారెడ్డి సన్మానం చేయించుకొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపారు. అలాగే, ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలపై అక్రమంగా హత్యాయత్నం కేసులు నమోదు చేయగా వారు జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. ఎస్ఐ పనితీరు సరిగా లేదని, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై వరుస ఫిర్యాదులు రావటంతో ఎస్పీ వకుల్ జిందాల్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి వెంటనే విధుల నుంచి తప్పిస్తూ అన్నంబొట్లవారిపాలెం వద్ద ఉన్న ఎన్నికల తనిఖీ చెక్‌పోస్టుకు అటాచ్ చేశారు. బల్లికురవకు సంతమాగులూరు స్టేషన్ ఎస్ఐ సురేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సీఐ నరసింహారావు పర్యవేక్షణ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన్నట్లు తెలుస్తుంది.

జాగర్లమూడివారిపాలెంలో ఆధ్యాత్మిక శోభ

» వైభవంగా దేవతామూర్తుల ప్రతిష్ఠ

» వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కొలువుదీరిన దేవతామూర్తులు

పంగులూరు, మార్చి 28: మండలంలోని జాగర్లమూడివారిపాలెంలో గురువారం శ్రీహనమత్ సీతాలక్ష్మణ సపరివార సహిత శ్రీకోదండ రామచంద్రస్వామి జీవధ్వజ విమాన శిఖర ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వాంగ సుందరంగా నిర్మించిన శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయంలో ప్రముఖ వేద పండితులు, శతాధిక ప్రతిష్ఠాపనాచార్య రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు జాగర్లమూడివారిపాలెం పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.





పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, కృష్ణచైతన్య

శ్రీకోదండరామచంద్రస్వామి ప్రతిష్ఠ మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, కృష్ణ చైతన్యలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ వీరిని ఘనంగా సత్కరించారు. వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, సర్పంచ్ జాగర్లమూడి వెంకటరత్నం, యలమందరావు. ధూళిపాళ్ళ వీరనారాయణ, జాగర్లమూడి వెంకటరావు, జనార్దన్, మోహనరావు, జాగర్లమూడి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కేతిన సత్యనారాయణ, ధూళిపాళ్ళ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం స్వామి వారి శాంతి కల్యాణం జరిపించారు. పదిమందికి పైగా దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుబ్బారావు, అప్పారావులు పూజా కార్యక్రమాలను, స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు సకల ఆంజనేయులు ఆధ్వర్యంలో సభ్యులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీగా అన్నదానం నిర్వహించారు.

మార్టూరులో పాండురంగస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

మార్టూరు, మార్చి 28: మార్టూరులోని పడమర బజారు ఆలయంలో శ్రీరుక్మా బాయి సమేత పాండురంగస్వామి శాంతి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవ స్థానం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో వేదమంత్రాలతో అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు.

వైభవంగా బాలాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వేటపాలెం(చీరాల), మార్చి 28: వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో గురువారం బాలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఆయన కుమారుడు గౌరీ అమర్‌నాథ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ప్రత్యేక పూజల్లో వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లుచేశారు.



పూజల్లో పాల్గొన్న కూటమి అభ్యర్థి కొండయ్య, గౌరీఅమర్‌నాథ్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ అభ్యర్థి వెంకటేష్

బార్ అసోసియేషన్ కార్యవర్గం





హజరత్తయ్య జబ్బార్

అద్దంకి, మార్చి28: అద్దంకి బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడుగా రావి హజరత్తయ్య వైస్ ప్రెసిడెంట్‌గా శానం నాగేశ్వరరావు, కార్యదర్శిగా జబ్బార్, జాయింట్ సెక్రటరీగా సత్యవతి, ట్రెజరర్‌గా హరిబాబు, మహిళా ప్రతినిధిగా కుసుమలతతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియను న్యా యవాది ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

ప్రత్యేకావసరాల చిన్నారులకు భవిత కేంద్రాలు ఓ వరం

అద్దంకిటౌన్, మార్చి 28: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత విద్యావనరుల కేంద్రాలు ఒక వరం లాంటివని సహిత విద్యా జిల్లా సమన్వయకర్త ఎం.జ్యోత్స్న అన్నారు. వీటిని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. గురువారం అద్దంకిలోని సత్రం బడి ఆవరణంలో ఉన్న భవిత విద్యావనరుల కేంద్రంలో రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జ్యోత్స్న మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య పరీక్షలలో 201 మంది చిన్నారులను అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. త్వరలో వీరందరికి ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరంలో ఎస్.నివేదిత, జి.లాస్య యాదవ్, టి.నాగకోటేశ్వరరావు, కె.చైతన్య, ఇందిరాప్రియదర్శిని లు చిన్నారులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.గంగాధరరావు, బి.సుధాకరరావు, హెచ్ఎం ఇట్టా రామారావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, రమణారెడ్డి, బాబురావు, గంగాదర్, కొండయ్య, ఫిలిప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

బల్లికురవ, మార్చి 28: లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు దాడికి పాల్పడిన కొప్పెరపాలెంకు చెందిన వల్లెపు నాగేశ్వరరావు అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసిన్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వివాహితను ఈనెల 24న నాగేశ్వరరావు రాత్రి సమయంలో ఇంట్లోకి వెళ్లి అత్యాచార యత్నం చేయటంతో పాటు కత్తితో దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆమె ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు వెళ్లి అక్కడనుంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరు పరిచినట్లు సురేష్ తెలిపారు.

పది క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీ

బల్లికురవ, మార్చి 28: మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో వల్లెపు శ్రీను అనే రైతుకు చెందిన పంట పొలంలో పది క్వింటాళ్ల మిర్చి బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. సంతమాగులూరు మండలం కొప్పరంకు చెందిన వల్లెపు శ్రీను అనే రైతు బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేశాడు. కోత కొసిన మిర్చి పంట పొలంలో ఎండటానికి ఉంచగా గుర్తు తెలియని దొంగలు సుమారు పది క్వింటాళ్ల మిర్చిని తస్కరించారు. గురువారం పొలం వద్దకు వచ్చిన రైతు మిర్చి చోరీ జరిగిన విషయం గుర్తించి వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు గ్రామాలవారీగా నేతలతో గొట్టిపాటి సమీక్ష

పంగులూరు, మార్చి 28: మండలంలోని పలుగ్రామాల టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జాగర్లమూడివారిపాలెం, అలవలపాడు, తక్కెళ్ళపాడు, నూజెళ్ళపళ్ళి, చినమల్లవరం, కొండమూరు గ్రామాల నేతలతో రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈ సమీక్షకు ఆయాగ్రామాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజంట్లు, పేజీ నేస్తం సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

చినగంజాం, మార్చి 28: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యకర్మలు పొద వీరయ్య, అబ్దుల్‌కలాం అజాద్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 42వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీరయ్య తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబసభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు

80 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు, మార్చి 28: మద్యం అక్రమంగా అమ్ముతున్న ఓవ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. గురువారం మధ్యాహ్నం కొణిదెన రోడ్డులో ఈ సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని రాజుపాలెంకు చెందిన బాలకృష్ణ మద్యాన్ని అనధికారికంగా అధిక ధరలకు అమ్ముతుంటారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో కొణిదెన రోడ్డులో పోలీసులు కాపుకాసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని స్కూటీలో 30 బాటిళ్లు, ఇతర ప్రదేశంలో 50 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసకొని స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.13,060 ఉంటుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తనిఖీలలో ఏఎస్ఐలు సైదా, మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు, కానిస్టేబుల్ జె.రమేష్ పాల్గొన్నారు.

పలు గ్రామాలలో కవాతు

అద్దంకి, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మైలవరం, ఉప్పలపాడు, వెంపరాల, చక్రాయపాలెంలో గురువారం సాయంత్రం పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును నిర్భయంగా ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవడానికి ప్రజలకు పోలీసులు అండగా ఉంటారన్నారు. ఎస్సైలు నాగరాజు, రత్నకుమారి, బిఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, పోగొట్టుకున్న వ్యక్తులకు మూడు సెల్‌ఫోన్‌లను సీఐ కృష్ణయ్య గురువారం అందజేశారు. ఇటీవల అద్దంకి పట్టణానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు, వెస్ట్ నాయుడుపాలెంకు చెందిన షేక్ మస్తాన్, గొర్రెపాడుకు చెందిన కోటేశ్వరరావులు వివిధ పనుల నిమిత్తం వచ్చి ఇటీవల అద్దంకి పట్టణంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌లు గుర్తించి గురువారం అందజేశారు. సెల్‌ఫోన్‌లు రికవరీలో చురుకుగా పనిచేసిన ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ కృష్ణయ్య అభినందించారు.

ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), మార్చి 28: విక్రయదారులు ఎవరైనా ఆహార పదార్థాల కల్తీకి పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రణీత్‌కుమార్ చెప్పారు. గరువారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆహార భద్రత చట్టాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ శిక్షకుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈవో సస్పెన్షన్

చీరాల, మార్చి 28 : వేటపాలెం మండలం కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో జీవీఎల్ కుమార్‌ను గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల సత్రం ఖాతాకు సంబంబంధించి రూ.32 లక్షలు అనధికారికంగా డ్రా చేసినట్లు నేరెళ్ల గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ జరపగా నిధులు డ్రా చేసినట్లు ధ్రువీకరణ కావటంతో కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసులు మెరుపుదాడి

» 8 మంది అరెస్ట్, రూ.2,21,400 నగదు స్వాధీనం

పర్చూరు, మార్చి 28: పేకాట శిబిరంపై బాపట్ల జిల్లా పోలీసులు మెరుపుదాడి చేశారు. పర్చూరు మండలం వీరన్నపాలెం - రమణాయపాలెం రోడ్డులోని నల్లగుంట డొంక వద్ద పేకాల స్థావరంపై గురువారం మధ్యాహ్నం మెరుపు దాడిచేసి భారీ మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్‌కు అందిన సమాచారం మేరకు ఆయన ఆదేశాలతో.. డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం, పర్చూరు ఎస్సై ఎస్.రమేష్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటుచేసి ఏకకాలంతో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.2,21,400 నగదుతోపాటు, 9 ద్విచక్ర వాహనాలు, 18 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఇందుకుసంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందాలతో మెరుపు దాడి చేసినట్టు చెప్పారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : 6.22
సహరి (శనివారం) : 4.48

ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	35.4	26.0
కావలి	35.0	26.0
కందుకూరు	36.0	26.0
ఆత్మకూరు	38.0	26.0
ఉదయగిరి	37.0	26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024



తురగముపై తల్పగిరీశుడు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం 9వరోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యారాధన, హోమం, మధ్యాహ్నం తిరుప్పావై నాడల్ ఉత్సవాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు చేశారు. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి స్వామివారికి అశ్వవాహన సేవలో పేట ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విజయ శిఖరాల వైపు..

వ్యూహాత్మక అడుగులు!

- కొత్త అభ్యర్థుల స్థానాలపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- నేడు కావలి, ఉదయగిరిలలో పర్యటన
- వింజమూరులో రాత్రి బస.. పాత, కొత్తలను ఏకం చేసే ప్రయత్నాలు
- బాబు పర్యటనతో ఊపందుకోనున్న పడమటి నియోజకవర్గాలు

తెలుగుదేశం పార్టీని విజయ శిఖరాల వైపు నడిపించే దిశగా ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. 'ప్రజాగళం' సభలతో కొత్త అభ్యర్థులు బరిలో ఉన్న కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజక వర్గాల్లో శుక్రవారం ఆయన పర్యటిం చనున్నారు. ఆ దిశగా రాష్ట్ర పార్టీ ప్రణాళికాబద్ధంగా ఖరారు చేసిన చంద్రబాబు పర్యటన కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్న ఆ మూడు నియో జకవర్గాల్లో తెలు గుదేశం పార్టీని మరింత బల పేతం చేస్తా యనే అంచ నాలు వ్యక్తం అవుతు న్నాయి.



నెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు కావలి దళితవాడ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చంద్రబాబుకు చేరుకుంటారు. అక్కడ నుంచి కావలిలోని ఏఎం బేకరి సెంటర్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. 5 గంటలకు కావలి నుంచి బయలుదేరి వింజమూరు చేరుకుంటారు. 5.30 నుంచి 7.30 గంటల వరకు బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. రాత్రికి స్థానిక ఎస్వీ కన్వెన్షన్ సెంటర్‌లో బస చేస్తారు.

● వ్యూహం ఇదే!

నెల్లూరు పార్లమెంట్ పరిధిలో జరిగే చంద్రబాబు ప్రజాగళం పర్యటనను జాతీయ పార్టీ వ్యూహాత్మకంగా ఖరారు చేసింది. తొలుత నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ప్రజాగళం నిర్వహించాలని అనుకున్నా ఆ తరువాత అధినేత అవసరం ఎక్కడుందో ఆ నియోజకవర్గాల్లోనే ప్రజాగళం నిర్వహించాలన్న ఉద్దేశంతో పర్యటన ప్రదేశాల్లో మార్పు చేశారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు సీనియర్లు. నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పట్టు కలిగినవారు. ఇక కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తొలిసారిగా పోటీ చేస్తున్నా ప్రచారంలో, రాజకీయ సమీకరణల్లో దూసుకుపోతున్నారు. కాబట్టి ఈ మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికిప్పుడు చంద్రబాబు పర్యటన అవసరం లేదని జాతీయ పార్టీ భావించింది. ఆ క్రమంలోనే పార్లమెంట్ పరిధిలో కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్న మూడు నియోజకవర్గాలపై దృష్టిపెట్టి వాటి కేంద్రంగా కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం సభలను ఖరారు చేసింది.

కావలి, వింజమూరు (ఉదయగిరి నియోజకవర్గం)లలో చంద్రబాబు పర్యటనతో పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు కొత్త అభ్యర్థులకు, ఆ నియోజకవర్గాలకు కొత్త ఊపు తీసుకరానుంది. కావలి అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి), ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్, కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు.. ఈ ముగ్గురు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వాస్తవానికి ఈ నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉన్నా అభ్యర్థులు కొత్తకావడం, పాత కొత్త నాయకుల కలయిక విషయాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయి. తక్షణం వీటిని పరిష్కరించాల్సిన అవసరం కూడా ఉంది. కావలిలో పాత, కొత్త నాయకుల మధ్య ఇంకా సయోధ్య కుదరలేదు.

● అందరినీ కలిపేందుకే..

ఉదయగిరి నియోజకవర్గంలో బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొత్తగా పార్టీలో చేరిన వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఇలా ఇంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఉన్నా ఇప్పటివరకు ఈ నలుగురు ఒకే వేదికపైకి కలిసిరాలేదు. ఇక్కడ పాత, కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదర్చాల్సిన అవసరం చాలా ఉంది. అలాగే కందుకూరులో కూడా ఇలాంటి సమస్యలు ఉన్నాయి. వీటన్నింటిని చక్కదిద్దడం కోసమే చంద్రబాబు కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రజాగళం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. అందుకోసమే శుక్రవారం రాత్రి వింజమూరులో బస చేస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. కావలి, వింజమూరు బహిరంగ సభల ద్వారా ఆ రెండు నియోజకవర్గాలతో పాటు కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల ప్రజలను సైతం చైతన్య పరచడంతోపాటు రాత్రి బసలో పార్టీ నాయకులను చక్కదిద్దేపనిలో చంద్రబాబు నిమగ్నం అవుతారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

పర్యాటక కేంద్రంగా ఏఎస్‌పేట దర్గా

శ్రీకాళహస్తి-నడికుడి రైలుమార్గం పూర్తి చేయిస్తా.. ● నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వీపీఆర్

ఏఎస్ పేట, మార్చి 28: ఎన్నికల్లో తనను నెల్లూరు ఎంపీగా గెలిపిస్తే ఏఎస్ పేట దర్గాను పర్యాటక కేంద్రంగా మారుస్తానని, శ్రీకాళహస్తి- నడికుడి రైలు మార్గం పూర్తి చేయిస్తామని టీడీపీ కూటమి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ఏఎస్ పేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయాలన్నా, వృద్ధులకు 4వేలు పింఛన్ కావాలన్నా తనను, ఆనం రామనారాయణరెడ్డి గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించి సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన 100రోజులలో వాటిని అమలు చేస్తామన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి ప్రస్తుత నాయకులు 10ఏళ్లలో చేసిన విధ్వంసం మధ్య తేడా చూసి ప్రజలు ఓటు చేయాలని కోరారు. కాగా, అంతకముందు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డికి తెలుగుదేశం, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు.

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ముందుగా వారు గ్రామంలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకున్నారు. దర్గాలోని సమాధులపై పూలు,గలేపాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేమిరెడ్డి దర్గా విశిష్ట గురించి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్గా నుంచి ప్రజాగళం వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.



వీపీఆర్, ఆనంలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

● టీడీపీలో చేరికలు

వేమిరెడ్డి, ఆనం సమక్షంలో రాజవోలు సర్పంచి నరసయ్య, చిరమన సర్పంచి వెంకటేశ్వర్లు, శ్రీకొలను సర్పంచి లక్ష్మమ్మ, చిరమన ఎంపీటీసీ శైలజా, అనుమసముద్రం ఎంపీటీసీ చిన్నమ్మ, రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డిలతోపాటు పందిపాడు, అక్బారాబాదు మాజీ సర్పంచులతోపాటు నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పెంచలయ్య, నలిశెట్టి శ్రీధర్, అబ్బూరి రమేష్‌నాయుడు, నంది వివేకనందరెడ్డి, ఖాజామియ్య,షేక్ ఖాదర్‌బాషా, వాకిచర్ల వీరప్రతాప్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఊరట

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఓ తీయని కబురు పంపింది. ఇప్పటిదాకా దినసరి కూలి రూ.272 ఇస్తుండగా దానిని 28 రూపాయలకు పెంచి, 300లు చేసింది. పెంచిన ఈ కూలి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు కానుంది.

సంగం, మార్చి 28 : 2005లో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అప్పుడు దినసరి కూలి రూ.87.50 ఉండగా, క్రమేణా పెంచుతూ రూ.272లకు చేరింది. అయితే వేసవిలోని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నాలుగు నెలలపాటు ఉపాధి పనులు చేసేందుకు వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో వేసవిలో నేల గట్టి పడి పని జరగదని ఈ 4 నెలల పాటు 20 నుంచి 30 శాతం వేసవి అలవెన్స్ కింద కూలి పొందేవారు. రెండేళ్ల కిందట కేంద్రం కొత్తగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలులోకి తెచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన వివరాలు పొందుపరచకపోవడంతో కూలీలకు వేసవి భత్యం అమలుకాలేదు. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా 2022లో రూ.12, 2023లో రూ. 15 చొప్పున పెంచగా, ఈ ఏడాది మరో రూ.28 కూలి పెంచింది. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

● 6.1 లక్షల మందికి లబ్ధి

జిల్లాలో సుమారు 6 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 30,523 శ్రమశక్తి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారు 6.10 లక్షల మంది ఉపాధి కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో ప్రతినిత్యం సుమారు లక్ష మంది పనులు చేస్తున్నారు. కేంద్రం ఉపాధి దినసరి కూలి పెంచడంతో వీరంతా లబ్ధి పొందనున్నారు.



విలపిస్తున్న బంధువులు, మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది

పెళ్లి వేడుకలో ఆనందంగా గడిపిన వారంతా సొంతూరు కందుకూరుకు బయలుదేరారు. వధూవరులతోపాటు బంధుమిత్రులు బస్సులో వస్తుండగా, వారు కందుకూరు చేరుకునేలోపు ఇంటి వద్ద పనులన్నీ చక్కబెడదామన్న ఆలోచనతో మరికొందరు కారులో బయల్దేరారు. అనుకోని ప్రమాదం పెళ్లిబృందంలో తీవ్ర విషాదం నింపింది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్ద కారు అదుపుతప్పి రోడ్డుకు రెండో వైపు మార్జిన్‌లో ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొట్టింది. దీంతో వధువు తల్లి అరుణ (50), చిన్నమ్మ కుమార్తె శ్రావణి (22), మేనమామ భార్య దివ్య (28) అక్కడికక్కడే మృతి చెందారు. వధువు సోదరుడు వేణు, మేనమామ వినోద్.. ఆయన మూడేళ్ల కుమారుడు అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది.



- అదుపుతప్పిన కారు.. మార్జిన్ దిమ్మెకు ఢీ
- వధువు తల్లి సహా ఇద్దరు బంధువుల మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తూర్పునాయుడుపాలెం సమీపంలో ఘటన

పెళ్లింట విషాదం

ఒంగోలు (క్రైం), మార్చి 28 : వధువు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయాణిస్తున్న కారు మరో గంటలో కందుకూరు చేరుకునేది. ఈలోపే ముగ్గురు మహిళలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. తూర్పునాయుడుపాలెం దాటగానే పెళ్లి బృందం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో కారు 120 కి.మీ వేగంతో వెళుతున్నట్లు భావిస్తున్నారు. దీంతోపాటు నిద్రమత్తు కూడా కారణమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తు న్నారు. సమాచారం అందుకున్న వెంటనే హైవే ఎస్సై నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది సాయంతో కారు నుంచి మృతులను, క్షతగాత్రులను బయటకు తీశా రు. గాయపడిన వారిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీ సులు పంచనామా అనంతరం మృతదేహాలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



మృత్యుంజయుడు ఈ బాలుడు

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అప్పటికే అక్కడున్న సింగరాయకొండ సీఐ రంగనాథ్‌ను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కన్నీరుమున్నీరైన బంధువులు

వెనుకనే వస్తున్న పెళ్లి బస్సు, ఇతర వాహనాల్లో ఉన్న బంధువులు ప్రమాద స్థలం వద్ద దిగి కన్నీరు మున్నీరయ్యారు. దివ్య అక్కడికక్కడే మృతి చెందడం.. ఆమె భర్త, కుమారుడు తీవ్రంగా గాయపడటం అందరినీ కలచి వేసింది. చెల్లి పెళ్లి చేసిన ఆనందం ఇంటికి వెళ్లే వరకు కూడా లేదని, తన తల్లి కళ్ల ముందే ప్రాణాలు విడిచిందని వేణు బోరున విలపించారు. తన కళ్ల ముందే భార్య దివ్య రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి వినోద్ కన్నీటి పర్యంత మయ్యాడు.



మినీలారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

● ఇద్దరు డ్రైవర్ల మృత్యువాత

వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లి సమీపంలోని హైవేపై గురువారం తెల్లవారుజామున ఆగిఉన్న లారీని మినీ లారీ వేగంగా ఢీకొంది. దీంతో ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని దేవనగిరి నుంచి రాగుల లోడుతో ఓ లారీ గుంటూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలోని భోగ్యంవారిపల్లి బస్టాండు సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున లారీని ఆపి డ్రైవర్ బత్తల సుబ్బరాయుడు టైర్లలో గాలిని గమనిస్తున్నాడు. అదే సమయంలో కడప జిల్లా కమలాపురం నుంచి గుంటూరు వైపు వెళ్తున్న మినీలారీ వేగంగా ఆగివున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ కడప జిల్లా అలంగనపల్లికి చెందిన బత్తల సుబ్బరాయుడు(60), మినీ లారీ డ్రైవర్ చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన రాసపుత్ర ప్రతాప్‌సింగ్ (44) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. హైవే చెక్‌పోస్టులో పోలీసులు సమాచారాన్ని అధికారులకు అందజేశారు. దీంతో సీఐ గిరిబాబు, ఎస్‌ఐ తిరుపతయ్య ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. మినీలారీలో చిక్కుకున్న ప్రతాప్‌సింగ్ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో వెలికి తీసి ఉదయగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ క్లీనర్ రెహనా శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బొట్టుబిళ్లలు.. టీషర్టులు, టోపీలు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో తాయిలాలు
- జోరుగా మద్యం పంపకాలు కూడా...

కావలి రూరల్, మార్చి 28 : ఎన్నికల కోడ్‌ను అధికార వైసీపీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఓటర్ల మభ్య పెట్టడమే లక్ష్యంగా చీరలు మొదలు బొట్టుబిళ్లలు, టోపీలు, మద్యం సాసీలు ఇలా తాయిలాలు ఇస్తోంది. నెల్లూరు జిల్లా కావలి మండలం పెద్దపట్టపుపాలెం పంచాయతీ నందెమ్మపురంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బాలురకు సీఎం జగన్ బొమ్మతో కూడిన మాస్కులు, వైసీపీ రంగులు కలిగిన టోపీలు, టీషర్టులు అందజేశారు. అలాగే మహిళలకు, ఆడపిల్లలకు వైసీపీ గుర్తు, ముఖ్యమంత్రి ఫొటోలతో ఉన్న బొట్టుబిళ్లలు పంపిణీ చేశారు. చెన్నాయపాలెం పల్లెపాలెం లో రామాలయం పిల్లలకు జగన్ స్టిక్కర్లు దర్శన మిచ్చాయి. అంతేగాక రామాలయం వద్ద ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి వెళ్లిపోయిన కొద్దిసేపటికే వైసీపీ నాయకులు బస్తాలో తెచ్చిన క్వార్టర్ మద్యం సీసాలను పంచిపెట్టారు. ఇలా అడుగడుగునా ఎన్నికల నిబంధనలను అధికార పార్టీ నేతలు తుంగలో తొక్కడం చర్చనీయాంశమైంది.



వృద్ధుడి చేతిలో మద్యం సీసాలు



విజయసాయి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

మధ్యలోనే జంప్!

ఓ చిత్రంలో వాహనం వద్ద ఎగబడుతున్న జనం.. మరో చిత్రంలో వెళ్లిపోతున్న జనాన్ని చూశారా!? సీతారామపురంలో వైసీపీ అభ్యర్థులు విజయసాయి రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డిలు గురువారం సీతారామపురంలో రోడ్ షో నిర్వహించారు. అయితే, బస్టాండు సెంటర్‌లో విజయసాయి మాట్లాడుతుండగానే జనం వెనుతిరిగి వెళ్లిపోయారు. 'ఎవరూ వెళ్లొద్దు. భోజనాలు ఏర్పాటు చేశాం' అని నాయకులు బతిమలాడినా కుదరలేదు. మరోవైపు లారీలో తెచ్చిన బిర్యానీ ప్యాకెట్ల కోసం జనం ఎగబడ్డారు. కాగా, విజయసాయి సభ కోసం రెండ్రోజులుగా నాయకులు జనసమీకరణకు ప్రణాళికలు వేసుకున్నారు. వచ్చిన వారికి రోజువారి కూలితోపాటు బిర్యానీ పొట్లాలు, మద్యం ఇచ్చినట్లు సమాచారం.

\- సీతారామపురం



బిర్యానీ ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న ప్రజలు

ఎన్నికల నిర్వహణకు 15వేల మంది సిబ్బంది

- మరో వెయ్యి మంది మైక్రో అబ్జర్వర్లు
- కలెక్టర్ హరినారాయణన్



వీఆర్ కళాశాలలో జరుగుతున్న శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 28 : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 15వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం నగరంలోని వీఆర్ కళాశాల, డీకేడబ్ల్యూ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఎన్నికల పరిశీలనకు మరో వెయ్యిమంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని చెప్పారు. మొదటి విడతగా గురువారం 2500 మందికి, శనివారం మరో 2500 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 12 మంది అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీరి ట్రైనర్ల ద్వారా పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ మలోల, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

● శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

ఆత్మకూరు : పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ స్పష్టం చేశారు. గురువారం ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ అధికారుల శిక్షణను ఆయన పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో దోపిడీ, విధ్వంసం

- ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభం
- ఓ కుటుంబం గుత్తాధిపత్యంతో ఆత్మకూరు వెనుకబాటు
- ఈ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి


ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోపిడీ, విధ్వంసం రాజ్యమేలుతూ ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. గురువారం ఆత్మ కూరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి తొలి క్యాబినెట్ సమావేశంలోనే కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రజావేదిక కూల్చివేత నుంచే విధ్వంసం ప్రారంభమైయ్యిందని విమర్శించారు. నాటినుంచి నేటివరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగం పరిరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఈ ఎన్నికల్లో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పోరాటంలో సమాజంలోని మేధావులు, ప్రజలు కూటమిని బలపరచి వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదగా ఉన్న కొండలు, గుట్టలను మాయం చేశారని తెలిపారు. ఆత్మకూరు పదేళ్లుగా ఓ కు టుంబ గుత్తాధిపత్యంలో అభివృద్ధి వెనుకబడిందన్నారు. అధికారపార్టీ నేతలు ఇక్కడ ఖనిజ సంపదను కొల్లగొట్టి కోట్లాది రూపాయలను సంపాదించుకున్నారని విమర్శించారు. ఆత్మకూరు అసెంబ్లీ నుంచి నన్ను, పార్లమెంటుకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పాటుపడాలన్నారు. రాష్ట్రంలో కూటమిని విజయం కోసం నాయకులు, కార్యకర్తలను సమన్వయం పరుచుకుంటూ ప్రచారం నిర్వమిస్తామ న్నారు. ఈ ప్రాంతంలో తాను గతంలో చేసిన అభివృద్ధిని ఆ తరువాత వచ్చినవారు చేసిన అభివృద్ధిని పరిశీలించి ఓటు వేయాలని కోరారు. అంతేకాదు టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పిడుగురాళ్ల వరకు ఆగిపోయిన నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైను పూర్తి చేస్తామని, నిధులు లేక నిలిపేసిన నాలుగు మండలాలలకు సాగు, తాగు నీరందించేందుకు ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పూర్తి చేస్తామని తెలిపారు. ఆత్మకూరులోని 100 పడకల జిల్లా ప్రభుత్వ వైద్యశాలను 250 పడకల వైద్యశాల తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విక్రమ సింహపురి యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల, అదేవిధంగా ప్రతి మండల కేంద్రం నుంచి ఆత్మకూరుకు రెండు లైన్ల రహదారి, ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రాలకు మంచి రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల ప్రధాన కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణకు గైర్హాజరైతే చర్యలు తప్పవు

- పోలింగ్ అధికారులను రప్పించే బాధ్యత ఆర్వోలదే..
- జిల్లా కలెక్టర్ హరినారాయణన్

ఉదయగిరి రూరల్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయ ణన్ హెచ్చరించారు. గురువారం ఉదయగిరిలోని గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రిసై డింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మే 13న జరుగనున్న పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా ఉండేందుకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రెండువిడతల్లో 16వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొదటివిడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారుల స మక్షంలో పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల శిక్షణకు అధికారులు నూరుశాతం అధికారులు శిక్షణ కు హాజరయ్యేలా ఆర్వోలే బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనం అందించాలని సూచించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించి వసతులపై ఆరా తీశారు. పాఠశాలకు ఒకేగేటు ఉండడంతో పెద్దది చేయమని చెప్పడంతో వెళ్లేందుకు మరో గేటు చేస్తామని ఎంఈవో జానికీరామ్ తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న బీఎల్వోలను పోలింగ్ కేంద్రం వారిగా ఎంత మంది ఓటర్లు ఉన్నారు. అందులో దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఎంత మంది ఉన్నారని అడిగారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు రమాదేవి, ఎంఈవో జానికీరామ్, బీఎల్వోలు ఉన్నారు.


ఎన్నికల నిబంధనల మాడ్యూల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

వాహనాల తనిఖీ


సంగం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

సంగం, మార్చి 28: ముంబాయి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను గురువారం సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవినాయక్, ఎస్ఐ నాగార్జునరెడ్డిలు తనిఖీ చేశారు. వాహనాల్లో భారీగా నగదు, ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు వస్తు సామగ్రిని తరలించకుండా నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రసీదులు లేకుండా నగదు రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకుపోరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి తీసుకెళ్తూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు


ప్రయాణికులకు మజ్జిగ ఇస్తున్న డ్రైవర్లు

సంగం, మార్చి 28: స్థానిక బస్టాండ్‌లో టెంపో, కారు స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రయాణికుల కోసం గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. డ్రైవర్ల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వేసవి ముగిసే వరకు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు మజ్జిగ సరఫరా చేశారు. కార్యక్రమంలో టెంపో, కారు స్టాండ్ యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు

ఉదయగిరి, మార్చి 28: ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయించాలని ఏపీడీ గాయత్రిదేవి సూచించారు. గురువారం ఆమె స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి కూలికి పనితోపాటు పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనులు నిర్వహిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, మార్చి 28: పట్టణంలోని అరుంధతీయ వాడకు చెందిన పొదిలి తిరుపాలు మరణించాడు. విషయం తెలుసుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు గురువారం రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట మేకపాటి అభినవ్‌రెడ్డి, ఎంపీపీ మూలే పద్మజా వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సాయిప్రియను గెలిపించండి: కురుగొండ్ల


తిరుమలపాడులో మాట్లాడుతున్న కురుగొండ్ల

కలువాయి, మార్చి 28: వెంకటగిరి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తన కుమార్తె లక్ష్మీ సాయిప్రియను ప్రజలు ఆదరించి గెలిపించాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. గురువారం సాయంత్రం తిరుమలపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిం దన్నారు. ఈ మారు టీడీపీ అభ్యర్థిని వెంకటగిరి ఎమ్మెల్యేగా.. సీఎంగా చంద్రబాబు నాయుడును చేసుకునేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. తిరుమలపాడులోని ప్రభుత్వ భూమిని టీడీపీ అధికారంలోని రాగానే పేదలకు పంపిణీ చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటాని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 28: ఈ విద్యా సంవత్సరం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులున్నాయని తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఏపీ ఆన్‌లై న్ ద్వారా ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.

సర్వేయర్ కుటుంబానికి పరామర్శ

అనంతసాగరం, మార్చి 28: కొత్తపల్లి పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన సచివాలయ సర్వేయర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గురువారం అతని కుంటంబసభ్యులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వపరంగా వచ్చే సాయం త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయండి

సీతారామపురం, మార్చి 28: నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వింజమూరులో నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వింజమూరు వెళ్లేందుకు బసినేనిపల్లి సెంటర్‌కు రావాలని పిలుపునిచ్చారు.

రేపు రాష్ట్ర ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశం

ఆత్మకూరు, మార్చి 28: గుంటూరులో ఈ నెల 30న జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాక వాసుదేవరావు మాదిగ, పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం వారు స్థానిక త్రికోటేశ్వర కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు బొద్దుకూరి మహేశ్, తాటిపర్తి లక్ష్మయ్య మాదిగలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం వింజమూరు, కావలిలో జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రోడ్ షోకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదినారాయణ మాదగ, గంగపట్ల లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు చర్యలు

ఉదయగిరి రూరల్: అన్నంపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లోని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామశివారు ప్రాంతాల్లో నీటితొట్లను నిర్మించి నీటిని సరఫరా చేస్తున్నట్లు గురువారం సర్పంచ్ కల్లూరి శ్యామల దేవికృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని డైరెక్ట్ పంపింగ్ పథకాలతో వృథా అవుతున్న నీటికి పైపులు ఏర్పాటు చేసి నీటి తొట్లలను నింపుతున్నట్లు చెప్పారు.


నీటి తొట్టిని నీటిని నింపుతున్న గ్రామస్థుడు →

నిరుపయోగంగా పౌరసరఫరాల గోదాము


ఉదయగిరిలోని గోదాము

ఉదయగిరి రూరల్: పట్టణంలోని కావలి మార్గంలో ఉన్న పౌరసరఫరా గోదాములు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వీటిని రూ.లక్షల వ్యయంతో నిర్మించారు. గతంలో ఇక్కడి నుంచే పౌరసరఫరాల కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో గోదాంలు వాడుకలో ఉండేవి. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని గోదాంలకు అద్దె చెల్లిస్తూ అక్కడ పౌరసరఫరాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గోదాంల నిర్వహణ కొరవడి నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీనికితోడు రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారడంతో గోదాంల ఆవరణ మొత్తం వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిపోయింది. వేల మెట్రిక్ టన్నుల సామ ర్థ్యం ఉన్న మూడు గోదాములను అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయమైనా చేకూరుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. పౌరసరఫరాల గోదాంలను నిరుపయోగంగా వదిలేసి, మార్కెట్ కమిటీ గోదాంలను అద్దెకు తీసుకొని కార్యకలాపాలు నిర్వహించడం ఏమిటో అధికారులకే తెలియాలని పట్టణవాసులు ఆరోపణలు చేస్తున్నారు.

1 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

కందుకూరు : పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. మస్తానయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోడ్ అమలులో ఉన్నా ఆగని ఇసుక అక్రమ రవాణా

లింగసముద్రం, మార్చి 28: ఎన్నికల కోడ్ అమలవుతున్నా రాళ్లపాడు మన్నేరు పరీవాహక ప్రాంతంలోని గ్రామాల సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. ఓ వైపు లింగసముద్రం పోలీసులు, మరో వైపు కందుకూరు ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా, ఇసుకాసురులు అక్రమ రవాణాను ఆపడం లేదు.అంతేకాక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కూడా ఇసుకాసురులకు కలిసి వచ్చిందని భావిస్తున్నారు. మండలంలోని వీఆర్ కోట, అంగిరేకులపాడు, అన్నెబోయినపల్లి మన్నేరు సమీపంలోని గ్రామాలకు చెందిన కొందరు కూలీలు మన్నేరు వాగులోని ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్నారు. ఇసుకాసురులు తాతాహోటల్, లింగసముద్రంలలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించే వారికి ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

తెలుగుదేశంలోకి వైసీపీ కార్యకర్తల చేరిక

కందుకూరు : పట్టణంలోని 27వ వార్డులో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆ వార్డులోని అధికశాతం మంది వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వార్డులోని రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వీరంతా కూటమికి మద్దతిచ్చేందుకు ముందుకు రాగా వారందరికీ టీడీపీ, జనసేన కండువాలు కప్పి నాగేశ్వరరావు ఆహ్వానించారు.స్థానికులు శిగా శ్రీను, గోకరాజు మాధవరావు, ఆకుల నారాయణ, శిగా రమేష్ తదితరుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, పాలంకి ప్రసాదు, మేడా మల్లిఖార్జున, సవిడిబోయిన వెంకటకృష్ణ, దారం విజయ్‌కుమార్,మేడా నరసింగరావు, మల్లిఖార్జున, ఎం. శివశంకర్, గోకరాజు మదన్ పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వారు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ పరిధిలోని పలువురు బీసీ యువకులు గురువారం టీడీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బ్రాహ్మణక్రాకలోని క్యాంపు కార్యాలయంలో వంటేరు వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థా నికసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు ఓట్లువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- చంద్రబాబు సభను జయప్రదం చేయండి : కావ్య



కావలి : ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు టీడీపీ అధినేత నారా చంద్ర బాబు నాయుడు ప్రజాగళం కార్యక్రమాన్ని చేప ట్టారని కావలి టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి అ భ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నాయుడు శుక్రవారం సా యంత్రం 3.1 5 గంటలకు కావలిలో జరిగే ప్రజా గళం సభకు వస్తారన్నారు. ఇక్కడ ప్రజల సమ స్యలను అర్జీల రూపంలో తీసుకుని అధికారంలోకి రాగానే వాటి పరి ష్కారా నికి కృషి చేస్తారన్నారు. రాష్ట్రంలో ఉన్న అవినీతి అరాచకపాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాగళం సభలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- విశ్వనాథరావుపేటలో జోరుగా ప్రచారం

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గురువారం ఇంటింటికి తిరిగి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.సుధీర్‌బాబు, తిరుపతిరెడ్డి, శివకోటయ్య, చెన్నకేశవులు, అహ్మద్‌బాషా, జానకీరామయ్య పద్మమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు


కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

ఉలవపాడు, మార్చి 28: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కరేడు, చినపల్లెపాలెం, అలగాయపాలెం, ఉలవపాడు గ్రామాల్లో ప్రత్యేక దళాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్నా.. వసతి, విద్యాదీవెన నగదు ఎప్పుడిస్తావు..?

కావలి, మార్చి28: వసతి, విద్యాదీవెనకు బటన్ నొక్కినా నగదు ఖాతాల్లో పడకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5న బటన్ నొక్కినా ఇప్పటికి డబ్బులు పడలేదని, ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఉత్తుత్తి బటన్ నొక్కకుండా నిజమైన బటన్ నొక్కి బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలన్నారు. సమావేశంలో దళితనేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం, జడ్డా వాసు, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రభుత్వ సహకారమేది ?

కావలిటౌన్, మార్చి28: ఆటో కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, నూతన కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం సహకారమందించకపోగా రకరకాల పేర్లతో నగదు వసూలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఉక్కు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా నక్కల శ్రీను, కార్యదర్శిగా ధన్యాసి శ్రీను, ప్రసాద్, ఆదిరాజులను ఎన్నుకున్నారు.

'వైసీపీలో చేరారనడం అవాస్తవం'

లింగసముద్రం, మార్చి 28 : మండలంలోని అన్నెబోయినపల్లిలో టీడీపీకి చెందిన కుటుంబాలు వైసీపీలో చేరారనడం అవాస్తవమని మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, అన్నెబోయినపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కామినేని ప్రసాద్‌లు ఖండించారు.గురువారం లింగసముద్రంలో వారు మాట్లాడుతూ, బుధవారం అన్నెబోయినపల్లిలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో టీడీపీకి చెందిన పలు కుటుంబాలు వైసీపీలో చేరినట్టు ఆ పార్టీ పత్రికలో వార్త వచ్చిందని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిలో ఎవరూ టీడీపీ సంబంధించిన వారు లేరని, వారంతా వైసీపీకి చెందిన వారేనని వారు చెప్పారు. కార్యక్రమంలో లింగసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, ఇతర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో టెక్నోపల్స్ సింపోజియం

బిట్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నోపల్స్ 2కె24 సింపోజియం జరిగింది. ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 600మందిపైగా విద్యార్థులు అప్లై చేశారని, అందులో మెరిట్ పేపర్స్ 249 ఎంపిక చేసి ప్రజెంటేషన్ ఇప్పించామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందచేశామన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్వీ రమణారెడ్డి కన్వీనర్ ఎన్ కృష్ణచైతన్య ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు వీ.సునీల్‌రెడ్డి పీవీ రామకుమార్, ప్రసాద్‌రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

బిట్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని జిల్లా డ్రగ్స్, డయాగ్నిస్టిక్ విభాగం వైద్యాధికారి ఎం.శ్రీనివాసులురెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, ఫార్మసీ లాబ్, ఓపీ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారులు జీహారిక, నిత్యప్రశాంతిలతో పీహెచ్‌సీ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణులు

కావలిటౌన్, మార్చి 28: కాకినాడ శివాలయంలో అర్చకుడిపై దాడి పట్ల బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద బ్రాహ్మణులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులపై దాడులు నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని కోరారు.

- బ్రాహ్మణ సంఘానికి సంబంధం లేదు

టీడీపీ కార్యాలయంలో సంఘం సభ్యుడు బిట్రగుంట శివకుమార్ నిర్వహించిన సమావేశానికి బ్రాహ్మణ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని సంఘం నేతలు స్పష్టం చేసారు. బ్రాహ్మణులంతా కలిసి వైసీపీని ఓడిస్తారని, అందుకోసం ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారని సంఘం నాయకులు చెప్పటం వారి వ్యక్తిగతమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏవీ రమణమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్ నందనవనం మధుసూదన్‌రావు, ప్రకాషరావు, టీ రమేష్, మారుతీరావు, కనపర్తి రాజశేఖర్, సురేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం


ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఎమ్మార్, ప్రతాప్‌రెడ్డి

కావలి రూరల్, మార్చి 28: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. కావలి మండలం నందెమ్మపురంలో గురువారం పూజల అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎమ్మార్ మాట్లాడుతూ తనకు చెన్నాయపాలెం బిట్-2 ప్రాణంతో సమానమని అన్నారు. గతంలో మత్స్యకారులకు 65 ఏళ్లకు ఇచ్చే పింఛన్‌ను ఇప్పుడు 50 ఏళ్లకే ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూడోసారి తనను గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం వారు చెన్నాయపాలెం పల్లెపాలెం, చిన్న పట్టపుపాలెం, పెదపట్టపుపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, ఆప్‌కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, జెట్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవలు, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం...

అల్లూరు, మార్చి 28 : మన ఓటు మనమే వేసుకుందాం .. ఎస్సీ, ఎస్టీల నైతిక హక్కులను కాపాడుకుందామని కావలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. గురువారం ఆయన మండలంలోని గ్రద్దగుంట, బట్రకాగొల్లు, నార్తుఆములూరు, నార్తుమోపూరు గ్రామాల్లోని కాలనీల్లో పర్యటించారు.ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోవూరు బాబు, నక్కా గిరి, కప్పల నవీన్, కాలగంధం కిరణ్‌కుమార్, పోట్లూరు రామయ్య, పోట్లూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన జగన్‌ను చిత్తుగా ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు మాదిగ తదితరులు

కావలి, మార్చి28: మాదిగలను మోసం చేసిన జగన్‌ను చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగజాతి ప్రయోజనాలను ఎవరైతే నమ్మకంగా, నిజాయితీగా కాపాడతారో అలాంటి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వర్గీకరణకు సహకరించాలన్న ప్రధాన డిమాండ్‌కు చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. అందువల్ల ఎమ్మార్పీఎస్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. కావలి నియోజకవర్గంలో 25 వేల జనాభా కలిగిన మాదిగ జాతి అంతా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తమ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నేతలు సూరిపాక వాసుదేవరావు, గొల్లపపల్లి శ్రీనివాస్, మంద పెంచలయ్య, సూరిపాక ఉదయక్రిష్ణ, పందిటి అంబేద్కర్, గోచిపాతల వెంకటేశ్వర్లు, జీ. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

బిట్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కొత్తూరులోని కోదండరామాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, ధ్వజశుద్ధి, రత్నన్యాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి.